# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 121 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 21 జూన్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 121 21³-06-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




విశాఖకు చేరుకున్న ప్రధాని నరేంద్రమోడీకి రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ ఘన స్వాగతం పలికారు

## బీహార్‌లోని కాంగ్రెస్ ఆటవిక పాలనకు

# ప్రజలే బుద్ధి చెప్పారు



### ప్రధాని నరేంద్రమోడీ

**న్యూఢిల్లీ జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పట్నా – బీహార్‌ను ఆటవిక రాజ్యంలోని నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు. ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55వేల కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మంది కి పైపుల ద్వారా తాగునీటిని

- తరువాయి 2లో..

## ఆంధ్రప్రదేశ్‌తో..

# చర్చలకు సిద్ధం

### సీఎం రేవంత్

**హైదరాబాద్, జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. జూన్ 23న కేబినెట్ సమావేశం అనంతరం అవసరం అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని చర్చలకు ఆహ్వానించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలను పరిష్కరించేందుకు సంభాషనే ఒక్కటే మార్గమని ఆయన పేర్కొన్నారు.

- తరువాయి 2లో..





## శ్రీశైలం జలాశయానికి..

# పెరుగుతున్న వరద

**ఇన్ ఫ్లో 75,551 క్యూసెక్కులు**

**ప్రస్తుత నీటిమట్టం 848.49 అడుగులు**

**నంద్యాల జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాయలసీమ, తెలంగాణ, కోస్తాకు తలమానికమైన నంద్యాల జిల్లా శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి పరిధిలో ఉన్న శ్రీశైలం జలాశయంకు రోజు రోజుకు వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం అధికారులు తెలిపిన వివరాల మేరకు శ్రీశైలం జలాశయంలోకి 75,551 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. జూరాల నుంచి 49,903

- తరువాయి 2లో..

## యోగాంధ్రకు ముస్తాబైన..

# సాగరతీరం..



- విశాఖలో యోగాంధ్రకు.. సర్వం సిద్ధం..
- ఏర్పాట్లు మామూలుగా లేవు మరి..!
- 22 రికార్డ్ ల కోసం మెగా ఈవెంట్
- హాజరుకానున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- సాగర తీరంలో 5 లక్షల మందితో యోగాసనాలు, ప్రపంచ రికార్డు లక్ష్యం
- 25 వేల మంది ఏకకాలంలో సూర్య నమస్కారాలు
- ఏపీ వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగాసనాలు
- ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు 34 కిలోమీటర్ల మేర కార్యక్రమం
- రూ.62 కోట్ల వ్యయంతో ఏర్పాట్లు, పటిష్ట భద్రతా చర్యలు
- వర్షం వస్తే ప్రత్యామ్నాయంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం సిద్ధం

**విశాఖపట్నం జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

విశాఖపట్నం – ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ 'యోగాంధ్ర' వేడుకలకు సర్వం సిద్ధమైంది. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని "యోగాంధ్ర 2025" కార్యక్రమాన్ని జూన్ 21వ తేదీన (శనివారం) విశాఖ సాగర తీరంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా యోగాసనాలు వేయనున్నారు. సుమారు 5 లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొననుండగా తద్వారా ప్రపంచ రికార్డు సృష్టించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈ భారీ ఈవెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనునుండడంతో దేశ వ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

**విశాఖ వేదికగా భారీ ప్రణాళికలు..**

విశాఖలోని ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు మొత్తం 127 కంపార్ట్‌మెంట్లలో యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు అధికారులు భారీ ప్రణాళికలు రూపొందించారు. ఒక్కో కంపార్ట్‌మెంట్ 200ఐ14 మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటవుతుంది. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో వెయ్యిమంది చొప్పున పాల్గొననున్నారు. ప్రతి సెక్షన్‌కు ఒక ఇన్‌చార్జ్, వైద్య సిబ్బంది, పదిమంది వాలంటీర్లు ఉంటారు. ఎల్ఈడీ స్క్రీన్లు, మైకులు, చిన్న స్టేజీలు, సౌండ్ సిస్టమ్‌లతో పూర్తిస్థాయి మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యోగా సంఘాల సభ్యులు, నేవీ, కోస్టల్ గార్డు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, కార్మికులు తదితరులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.

**22 రికార్డులు లక్ష్యం..**

అంతే కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. యోగాంధ్ర సందర్భంగా మొత్తం 22 రికార్డులను సాధించే లక్ష్యంగా

- తరువాయి 2లో..

## రప్పా రప్పా నరుకుతా అంటే..

# లోపలేస్తాం..

### జగన్‌కు పవన్ కల్యాణ్ స్వీట్ వార్నింగ్



**అమరావతి జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

%అమరావతి %-% సినిమాలో చెప్పే డైలాగులు సినిమా హాలు వరకే బాగుంటాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. వాటిని ఆచరణలో పెడతామని, , ఆ డైలాగులకు అనుగుణంగా ప్రవర్తిస్తామని అంటే ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదని తేల్చి చెప్పారు. అలా చేస్తే అన్న వారిని, చేసిన వారిని కూడా లోపలేస్తామని తెలిపారు.. ఏపీ మాజీ సీఎం జగన్ పల్నాడు పర్యటనలో "గంగమ్మ తల్లి జాతరలో యాట తల నరికినట్లు రప్పా రప్పా

- తరువాయి 2లో..

## విశాఖలో గవర్నర్‌తో మంత్రి లోకేశ్ భేటీ...


## 'యోగాంధ్ర'కు సర్వం సిద్ధం

- ప్రపంచ యోగా దినోత్సవం కోసం విశాఖకు గవర్నర్ అబ్దుల్ నజీర్
- గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి నారా లోకేశ్
- పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి 'యువగళం' పుస్తకం అందజేత
- రేపు విశాఖలో 5 లక్షల మందితో 'యోగాంధ్ర' కార్యక్రమం
- ప్రపంచ రికార్డు లక్ష్యంగా ఏపీ ప్రభుత్వ భారీ ఏర్పాట్లు
- 'యోగాంధ్ర'కు హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ

**అమరావతి జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు

వివరాలు 2లో..







## విశాఖకు మరో

# ఐటి దిగ్గజం..

### రూ.1582 కోట్లతో కాగ్నిజెంట్ క్యాంపస్



**అమరావతి జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమరావతి – ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగానికి ఊతమిచ్చే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ టెక్ సొల్యూషన్స్, విశాఖపట్నంలో తమ ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతోంది. విశాఖపట్నంలో ఐటీ కార్యకలాపాలను విస్తరించాలనే ఉద్దేశ్యంతో కాగ్నిజెంట్ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ తో కంపెనీ

- తరువాయి 2లో..

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

# భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

## తల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారా లోకేశ్

## అత్తగారికి ప్రేమపూర్వక శుభాకాంక్షలు చెప్పిన నారా బ్రాహ్మణి

**అమరావతి జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)** నేడు నారా భువనేశ్వరి పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ సోషల్ మీడియా వేదికగా కుటుంబ సభ్యులు ఆత్మీయ సందేశాన్ని పంచుకున్నారు. భర్త సీఎం చంద్రబాబు ఆమె తన జీవితానికి వెలుగు అని అభివర్ణించారు. అలాగే కుమారుడు లోకేశ్ కూడా ఆమెకు 'ఎక్స్' వేదికగా బర్త్‌డే విషెస్ తెలిపారు. నువ్వే నా బలం, నా మార్గదర్శి అంటూ తల్లికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ లోకేశ్ ట్వీట్ చేశారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు అమ్మా! నువ్వే నా బలం, నా మార్గదర్శి, మా కుటుంబానికి గుండెకాయ. నీ



నిస్వార్థమైన ప్రేమ, మౌనంగా నువ్వు చూపించే ధైర్యం నన్ను ఎంతగానో తీర్చిదిద్దాయి. నాకు నేర్పిన విలువలకు, ప్రతీరోజూ మా జీవితాల్లోకి నువ్వు తీసుకొచ్చే ఆత్మీయతకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ ఏడాది నీకు సంతోషం, ఆరోగ్యం, ప్రేమతో నిండిపోవాలని కోరుకుంటున్నాను" అని లోకేశ్ తన పోస్టులో రాసుకొచ్చారు. భువనేశ్వరి కోడలు నారా బ్రాహ్మణి కూడా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు భూ అత్తా! నేను నీ కోడలు కాకముందు నుంచే నువ్వు నాకు ఆదర్శం. చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు నీ దృఢత్వం, హుందాతనం, నిస్వార్థమైన ప్రేమ నన్ను ఎంతగానో తీర్చిదిద్దాయి. నా అత్తగా, మార్గదర్శిగా, నా ధైర్యానికి గొప్ప మూలంగా ఉన్నందుకు ధన్యవాదాలు" అని పోస్ట్ చేశారు.

## సంపాదకీయం

# నిర్లక్ష్యం వల్లే...

# ఈ ఘోర ప్రమాదం

ఒక ప్రమాదం, అందులోనూ పెద్ద ఎత్తున ప్రాణ నష్టం, జరగగానే ఒకటి రెండు రోజులు గగ్గోలు పెట్టడం, ఆ ప్రమాద కారణాలను గుర్తించి సవరించే పని ఎంత మాత్రమూ చేయకుండా మరొక ప్రమాదం దాకా మౌనంగా ఉండి పోవడం మన సమాజానికీ, రాజ కీయ నాయకత్వానికీ, ప్రచార సాధ నాలకూ బాగా అలవాటు అయిపోయింది. నిజానికి సమాజం మొత్తంగా ఇందులో చేయగలిగినదేమీ లేదు.

ఆ బాధ్యత రాజకీయ నాయకత్వాలదీ, ప్రభుత్వాలదీ, అధికార వ్యవస్థలదీ! ఒక ప్రమాదం జరగగానే కూలంకుషంగా అధ్యయనం చేసి, ప్రమాద కారణాలను అన్వేషించి, మరొకసారి అటువంటి ప్రమాదం జరగడానికి వీలులేని విధంగా ఆ కారణాలన్నిటినీ తొలగించవలసిన బాధ్యత అధికార వ్యవస్థలదే! అహ్మదాబాద్ విమాన ప్రమాదం అత్యంత విషాద కరమైన, ఘోరమైన ప్రమాదం. టేకాఫ్ అయిన కొద్ది సెకన్ల లోనే కూలిపోయి, 241 మంది విమాన ప్రయాణికులు, కనీసం 40 మంది ఇతరులు చనిపోయారు. ఆ ప్రమాదం ఎందుకు జరిగిందో, ఎలా జరిగిందో శాస్త్రీయ విశ్లేషణ జరిపి కారణాలు నిర్ధారించడానికి మూడు నాలుగేళ్లు పడుతుందంటున్నారు. ఈలోగా మన వాట్సప్ కారా?నాలూ, వాచాల త్వమే పెట్టుబడిగా నడుస్తున్న ఛానళ్లూ, సంచలనాత్మకమైతే చాలు ఎంత అబద్ధమైనా, ఎంత నిరాధారమైనా మాట్లాడ వచ్చునని అనుకుంటున్న సామాజిక మాధ్యమాలూ చాలా కారణాలను వండి వార్చాయి. ఈ ప్రమాదానికి సాంకేతిక కారణాలు ఎట్లాగూ అధ్యయనంలో బయటపడతాయి కాని ఈలోగా ఆలోచించ వలసిన సామాజిక, రాజకీయార్థిక కోణాల వైపు నుంచి చూస్తే అధికార వ్యవస్థల నిర్లక్ష్యం, లేదా లాభాపేక్షాపరుల అక్రమాలను అధికారులు అవినీతి వల్లనో, సోమరితనం వల్లనో చూసీ చూడనట్టు పోవడం మూల కారణం అని తేలుతుంది. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించి 2022 జనవరిలో టాటా గ్రూప్‌కు అప్పగించినప్పటి నుంచీ గడచిన మూడేళ్లలో ఆ సంస్థ నిర్వహణలో భద్రతా లోపాల గురించీ, నిర్వహణ లోపాల గురించీ, నిబంధనల ఉల్లంఘనలురించీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనేక సార్లు మందలించింది, జరిమానాలు వేసింది, హెచ్చ రించింది. విమానాల నిర్వహణలో, కాక్ పిట్ క్రమశిక్షణలో, అంతర్గత జవాబుదారీతనంలో లోపాలను ఎత్తి చూపింది. అర్హత లేని పైలట్లను వాడుతున్నారని 2025 జనవరిలో కూడా ముప్పై లక్షల రూపాయల జరిమానా విధించింది. అహ్మదాబాద్ సర్దార్ వల్లభ్ భాయి పటేల్ అంత ర్జాతీయ విమానాశ్రయం దేశంలో అత్యంత ప్రమాదకర విమానాశ్రయాలలో ఒకటని గతంలోనే పేరు పొందింది. విమానాలకు పక్షుల తాకిడి అతి ఎక్కువగా ఉండే విమానా శ్రయం అది. ఎందువల్లనంటే దాని రన్ వేలు సరాసరిగా కిక్కిరిసిన జనసమ్మర్దపు కాలనీలకూ, భవనాలకూ అంటు కుని ఉంటాయి. రన్ వేకూ నివాస గృహ, భవన సము దాయాలకూ మధ్య ప్రామాణికంగా ఉండవలసినంత దూరం కాదు గదా, కనీసమైన స్థలం కూడా లేదు. అందు వల్ల టేకాఫ్‌లో విఫలమయ్యే విమానం ఆ నివాస గృహాల మీద కూలిపోక తప్పదు. ఆ నివాస గృహాల భవన సముదాయాల కుప్పలో ఒకటి ఇప్పుడు నలభై మంది వైద్య విద్యార్థులు మరణించిన బీజే మెడికల్ కాలేజ్ విద్యార్థి వసతిగృహం. అయితే ఈ సంగతి ఇప్పుడు, ఇంత ఘోరమైన ప్రమాదం జరిగాక మాత్రమే తెలిసినది కాదు. ఎన్నో భద్రతా అధ్యయనాలు ఈ సంగతి ఎన్నో ఏళ్లుగా చెబుతూనే ఉన్నాయి. విమానాశ్రయ రన్ వే అంచుల్లో నివాస గృహాలు ఉన్నాయనీ, ఆ ఇళ్లవాళ్లు తమ చెత్తను ఈ గోడ ఇవతల పారబోస్తున్నారనీ, అక్కడ పురుగులు చేరి, ఆ పురుగుల కోసం పక్షులు వచ్చి, సరిగ్గా విమానం టేకాఫ్ సమయంలో ఫాన్‌లలోకి పక్షులు ఎగిరే అవకాశం ఉందనీబీ అక్కడ నేల చదునుగా లేదనీ, మురికి కాల్వల మాన్ హోల్స్ మీద కప్పులు కూడా లేవనీ ఇదివరకు తెలిసిన విషయాలే. అధ్యయనాలలో, నివేదికలలో రాసినవే. పరిష్కరించాలని సిఫారసులు అందినవే. డీజీసీఏ 2019 నివేదికలోనే అహ్మ దాబాద్ విమానాశ్రయం భద్రతా ప్రమాణాలు పాటించడంలో విఫలమయిందని వివరంగా రాసింది. అంతకు ముందే 2018లో 'ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' గుజరాత్ ప్రభుత్వానికి సమర్పించిన ఒక విజ్ఞాపనలో రన్ వే భద్రత కోసం, 29.79 ఎకరాల అదనపు స్థలం కావాలని కోరింది. దానికి గుజరాత్ ప్రభుత్వ ఆమోదం కూడా దొరి కింది. కాని అక్కడ ఉన్న 350 కుటుంబాలను తరలించి, స్థలం ఖాళీ చేయించడంలో రాజకీయాలు అడ్డుపడి ఏడు సంవత్సరాలు గడిచినా ఆ పని జరగలేదు.ప్రస్తుత విమానాశ్రయం మీద ఒత్తిడి తగ్గించే పరి ష్కారంగా ధోలేరాలో పదివేల ఎకరాలలో రెండో విమా నాశ్రయాన్ని 2022లో ప్రకటించారు. అది 2025 కల్లా ప్రారంభమవుతుందన్నారు. దాని ప్రచార కార్యక్రమం నడిచినంతగా నిర్మాణ కార్యకలాపాలు సాగలేదు. విజయ్ రూపానీ ఐదు సంవత్సరాల పాటు 2016 నుంచి 2021 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రమా దాల హెచ్చరికలన్నీ ఉన్నాయి. వాటిని నివారించే అవకాశాలూ ఉన్నాయి. కాని నిర్లక్ష్యమే రాజ్యమేలింది. ప్రస్తుత విమాన ప్రమాదంలో రూపానీ విషాదకర మరణానికి ఆ నిర్లక్ష్యమూ కారణమే!

## బీహార్‌లోని కాంగ్రెస్ ఆటవిక పాలనకు ప్రజలే బుద్ధి చెప్పారు

అందించామని చెప్పారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు.

**పేదలకు మరిన్ని ఇళ్లు**

పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలే తన కుటుంబ సభ్యులని, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని అన్నారు. అందరి కోసం కోసం రేయింబవళ్లూ శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు. బీహార్ స్వాతంత్ర్య సమరయోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్‌గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచంలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఏవై-యూ) కింద 6,600 మంది లబ్ధిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవై-యూ లబ్ధిదారులకు తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్‌లో తయారైన లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌తో.. చర్చలకు సిద్ధం

కర్ణాటకతో ఏర్పరచుకున్న స్నేహపూరిత సంబంధాలను ఏపితో కూడా కొనసాగించాలని తన ఆకాంక్షను వెల్లడించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కూడా జలవివాదాలు అలాగే కొనసాగుతున్నాయని రేవంత్ పేర్కొన్నారు. గోదావరి నీటి విషయంలో బీఆర్ఎస్ పార్టీ రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించిన వారిలో నిజాం, కాంగ్రెస్ మాత్రమే ఉన్నారని, కేసీఆర్ ఏదీ నిర్మించలేదని ఆయన స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టులో మార్పులు చేయడానికి తెలంగాణ అనుమతి తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. జాతీయ రాజకీయాలపై కూడా రేవంత్ రెడ్డి తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి ఇప్పుడు చంద్రబాబు నాయుడు అవసరమని, ఆంధ్రలో తెలుగుదేశం గెలవాలంటే గోదావరి నీళ్లు అవసరమని ఆయన అన్నారు. అదే సమయంలో, తెలంగాణలోని బిఆర్ఎస్ పార్టీ తమ రాజకీయ మనుగడ కోసం గోదావరి నీటి సమస్యను ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు.

## శ్రీశైలం జలాశయానికి.. పెరుగుతున్న వరద

క్యూసెక్కులు, స్పిల్ వే నుంచి 23,400 క్యూసెక్కుల నీరు, సుంకేసుల నుంచి 2,248 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఇంతవరకు విద్యుత్ ఉత్పత్తికి నీరు వదలట్లేదు. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 848.49 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం నీటిమట్టం కెపాసిటీ 215.8070 టీఎంసీలు కాగా, ప్రస్తుతం డ్యామ్ లో నీటి నిలువ 76.3162 టీఎంసీలుగా నిల్వ ఉంది. రోజురోజుకు వరదనీరు శ్రీశైలం ప్రాజెక్టులోకి వస్తూ ఉంది. ఏగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల జలాశయంలోకి నీరు ప్రవహిస్తోంది. గత పది రోజులుగా జలాశయంలోకి నీరు వస్తుంది. గత వారం రోజులుగా అధికారులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే సోమవారం జలాశయంలోకి 21,860 క్యూసెక్కుల నీరు వచ్చింది. నీటిమట్టం 841.50 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 64.0542 టీఎంసీలుగా ఉంది. మంగళవారం శ్రీశైలం జలాశయంలోకి భారీగా42,129 క్యూసెక్కుల నీరు వచ్చింది. నీటిమట్టం 843 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 66.5540 టీఎంసీలుగా చేరుకుంది. బుధవారం జలాశయంలోకి 25,175 క్యూసెక్కుల నీరు చేరింది. నీటిమట్టం 844.20 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 68.7145 టీఎంసీలకు చేరుకుంది. గురువారం జలాశయంలోకి 37,385 క్యూసెక్కుల నీరు చేరుకుంది. నీటిమట్టం 846.20 అడుగులు కాగా నీటి సామర్థ్యం 72.3450 టీఎంసీలకు చేరుకుంది. శుక్రవారం కూడా జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చింది. రోజురోజుకు వరద నీరు పెరుగుతుండటం రుతుపవనాలు ముందుగానే రావడంతో రైతుల ఆనందం వ్యక్తం చేయడం విశేషం. ఖరీఫ్ సీజన్ (%ఖష్త్రుతీఅట ఒము-ంశీఅ%) ప్రారంభమైన సందర్భంలో నీరు జలాశయంలోకి రావడంతో రాయలసీమ (%=ఖుఖుశ్రీఖంవవముఖు%) ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## యోగాంధ్రకు ముస్తాబైన..సాగరతీరం..

ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందులో 20 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 2 గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్కు సంబంధించినవి ఉన్నాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025లో భాగంగా మరో గిన్నిస్ రికార్డు కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. విశాఖలో 26,395 మంది గిరిజన విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించే కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద సూర్య నమస్కార కార్యక్రమం ఉండబోతుంది. రేపు వాతావరణం అనుకూలించక వర్షం పడితే.. ఆర్కే బీచ్ రోడ్డులో కార్యక్రమాలు రద్దు చేసి మొత్తం కార్యక్రమం ఇదే వేదిక వద్ద నిర్వహించే అవకాశం ఉంది. వాతావరణం అనుకూలంగా ఉంటే ఆర్కే బీచ్ రోడ్డులో గిన్నిస్ రికార్డు పూర్తయిన తర్వాత ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు ఏయుకు వచ్చి విద్యార్థుల సూర్య నమస్కారాలను పది నిమిషాల పాటు పరిశీలిస్తారు. ఏజెన్సీ నుండి గిరిజన విద్యార్థులను 106 పాఠశాలల నుంచి 495 బస్సుల్లో విశాఖకు తీసుకువస్తున్నారు. ముందుగా 25 వేల మంది గిరిజన విద్యార్థులతో 1.08 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేయించనున్నారు. .యోగ దినోత్సవం కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా సూర్య నమస్కార కార్యక్రమం నిలవనుంది. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఐదు లక్షల మందితో యోగా డే ఉత్సవాలతో గిన్నిస్ రికార్డును ఏపీ ప్రభుత్వం సాధించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మందికి పైగా ఒకేసారి యోగా చేయడం, ఒకే ప్రదేశంలో 3 లక్షల మందితో యోగా చేయడం వంటి రికార్డులపై దృష్టి సారించారు.

**సాగర తీరం వెంబడి అపూర్వ ఘట్టం**

ఈ మెగా ఈవెంట్ కోసం విశాఖ ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వరకు సుమారు 34 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని యోగా వేదికగా తీర్చిదిద్దారు. బీచ్ రోడ్డులో మొత్తం 326 కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేశారు. ప్రతి 40 అడుగులకు ఒక చిన్న వేదికను నిర్మించారు. ఈ ఏర్పాట్ల దృష్ట్యా, శుక్రవారం (జూన్ 20) నుంచే బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. కార్యక్రమంలో పాల్గొనేవారికి ముందుగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, క్యూఆర్ కోడ్ ద్వారా ప్రవేశం కల్పిస్తారు. ప్రతిఒక్కరికీ ఉచితంగా యోగా మ్యాట్, టీ షర్టులు అందజేస్తారు.

**18 క్రీడా మైదానాల్లో ప్రదర్శనలు**

మొత్తం 26 కిలోమీటర్ల సాగర తీరంతో పాటుగా మరో 18 క్రీడా మైదానాల్లో కూడా యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏయూ మైదానం, చినగదిలి గోల్ఫ్ క్లబ్, పిఎం పాలెం క్రికెట్ స్టేడియం, కొమ్మాది స్టేడియం, ఫోర్ట్ స్టేడియం, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం తదితర 18 క్రీడా మైదానాలు, మరో 30 అదనపు ప్రాంతాల్లో కూడా యోగా ప్రదర్శనలు నిర్వహిస్తారు.

**రూ.62 కోట్లతో విస్తృత ఏర్పాట్లు**

సుమారు 62 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాల్గొనేవారి సౌకర్యార్థం 3 వేల తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఐదు కంపార్ట్‌మెంట్‌లకు ఒక వైద్య శిబిరాన్ని, ప్రధాన వేదిక వద్ద పది పడకల తాత్కాలిక ఆసుపత్రిని సిద్ధం చేశారు. ప్రజల తరలింపు కోసం 3,600 ఆర్టీసీ బస్సులతో పాటు 7,295 ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు.

**వర్షం వచ్చినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

ఒకవేళ శనివారం వర్షం కురిస్తే, కార్యక్రమానికి అంతరాయం కలగకుండా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మైదానంలో సుమారు 20 వేల మంది గిరిజన విద్యార్థులతో ప్రత్యేక యోగా కార్యక్రమం కూడా జరగనుంది. ఇక్కడ కూడా పది పడకల ఆసుపత్రిని నిర్మించారు.

**భద్రత, పర్యవేక్షణ**

ప్రధాని పర్యటన నేపథ్యంలో విశాఖలో కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 10 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, బీచ్ రోడ్డు వెంబడి 2 వేల సీసీ కెమెరాలను అమర్చారు. కార్యక్రమ పర్యవేక్షణకు 26 మంది ప్రముఖ యోగా గురువులు, 1,500 మంది శిక్షకులు, 6,300 మంది వాలంటీర్లు సేవలందించనున్నారు. తూర్పు నౌకాదళం కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటోంది. వారి ఆధ్వర్యంలో 11 యుద్ధ నౌకలపై యోగా సాధన చేయనున్నారు. ప్రధాని మోదీ కాన్వాయ్ కోసం ఐఎన్ఎస్ డేగ నుంచి కమాండ్ గెస్ట్ హౌస్ వరకు పోలీసులు ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు.

**రేపటి షెడ్యూల్ ఇదే..**

%జూన్ 21న ఉదయం 6.25కు యోగాంధ్ర 2025 కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు అతిథులు ప్రసంగించనున్నారు. 6.30 నుంచి 6.45కు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి, ఏపీ సీఎం, ఏపీ డిప్యూటీ సీఎం ప్రసంగిస్తారు. ఆపై ప్రధాని 15 నిమిషాలు ప్రసంగించనున్నారు. 7 గంటలకు ఆసనాలు ప్రారంభించి.. 7.45 వరకు నిర్వహిస్తారు. దాంతో యోగాంధ్ర 2025 ముగుస్తుంది.

**ప్రధాని మోడీ షెడ్యూల్ ఇదే..**

ప్రధాని నరేంద్ర మోడీ భువనేశ్వర్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి నేటి సాయంత్రం 6:40కి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, ఎంపీలు ప్రధానికి స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఈస్ట్రన్ నేవల్ కమాండ్ ఆఫీసర్స్ మెస్ కు చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. మళ్లీ శనివారం ఉదయం 6:25కి, రోడ్డు మార్గం ద్వారా ఆర్కే బీచ్‌కి చేరుకుని, 6:30 నుంచి 7:50 వరకు యోగా విన్యాసాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, సుమారు 5 లక్షల మంది ప్రజలు పాల్గొననున్నారు.

యోగా అనంతరం ప్రధాని ప్రసంగించనుండగా దేశవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. మొత్తం 5 లక్షల మంది ప్రజలు యోగా ప్రదర్శనలలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఇక ఉదయం 7:50కి మోడీ యోగా కార్యక్రమం ముగించుకొని నేవల్ కమాండ్‌కు తిరిగి చేరుకుంటారు. 8:15 నుంచి 11:15 వరకు పలు రిజర్వ్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొంటారు. అనంతరం 11:25కి %×చీూ% సర్కార్ పెరేడ్ గ్రౌండ్ నుంచి హెలికాప్టర్ ద్వారా విమానాశ్రయం చేరుకుని, 11:50కి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరతారు. ఇక పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన చంద్రమౌళి భార్య నాగమణిని ప్రధాని మోదీ కలిసే అవకాశం ఉందని సమాచారం. ఆమె పేరును సైతం అధికారులు ఆహ్వాన జాబితాలో చేర్చారు.

## రప్పా రప్పా నరుకుతా అంటే.. లోపలేస్తాం..

నరుకుతా" అంటూ వైసీపీ శ్రేణులు ప్లకార్డులు ప్రదర్శించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన వైఎస్ జగన్ అది సినిమా డైలాగ్ అని సమర్థించారు. పుష్ప సినిమాలోని అనే డైలాగ్ అని మీడియాతో వెల్లడించారు. అలా ప్లకార్డ్ ప్రదర్శించడం తప్పుకాదంటూ ఆ కార్యకర్తను వెనకేసుకొచ్చారు.. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవరైనా చట్టం, నియమ నిబంధనలు పాటించాల్సిందే. ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించే అసాంఘిక శక్తుల పై కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించదు. కచ్చితంగా అలాంటి వారిపై రౌడీ షీట్లు తెరిచి.. అసాంఘిక శక్తులను అదుపు చేస్తామని పేర్కొన్నారు. అశాంతిని, అభద్రతను కలిగించే వారికి మద్దతుగా అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడుతున్న వారి పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తామని బహిరంగంగా ప్రదర్శనలు చేసే వారిని కట్టడి చేయకపోగా.. వారిని సమర్థించేలా మాట్లాడేవారి నేరమయ ఆలోచనలను ప్రజలంతా గమనించాలని పవన్ కల్యాణ్ సూచించారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమే అని మరచిపోవద్దని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ కు గుర్తు చేశారు.

## విశాఖలో గవర్నర్‌తో మంత్రి లోకేశ్ భేటీ...

## 'యోగాంధ్ర'కు సర్వం సిద్ధం

విశాఖపట్నం చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి, మంగళగిరి శాలువాతో సత్కరించారు. అనంతరం, తన యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన పుస్తకాన్ని మంత్రి లోకేశ్ గవర్నర్ నజీర్‌కు అందజేశారు. శనివారం (జూన్ 21) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలో 'యోగాంధ్ర' పేరిట భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రపంచ రికార్డు లక్ష్యంగా సుమారు 5 లక్షల మందితో ఈ యోగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా పాల్గొంటున్న నేపథ్యంలో, 'యోగాంధ్ర'పై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తి నెలకొంది. ప్రధాని వస్తుండడంతో ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యత చేకూరింది. ఈ బృహత్తర కార్యక్రమ ఏర్పాట్లను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విశాఖ నగరం ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

## విశాఖకు మరో ఐటి దిగ్గజం..

ప్రతినిధులు సమావేశమై తమ ప్రణాళికలను వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.1,582 కోట్ల రూపాయల భారీ పెట్టుబడి పెట్టేందుకు కాగ్నిజెంట్ సుముఖత వ్యక్తం చేసింది. ఈ పెట్టుబడి ద్వారా ప్రత్యక్షంగా దాదాపు ఎనిమిది వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. కాగ్నిజెంట్ సంస్థ, తమ క్యాంపస్ ఏర్పాటు కోసం విశాఖపట్నంలోని కాపులుప్పాడ ప్రాంతంలో 21.31 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. పరిశ్రమల ప్రోత్సాహంలో భాగంగా, ఈ భూమిని ఎకరా కేవలం 99 పైసల నామమాత్రపు ధరకే కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ఐటీ క్యాంపస్‌ను నిర్మించి, కార్యకలాపాలు సాగించడానికి సిద్ధంగా ఉన్నామని కాగ్నిజెంట్ ప్రతినిధులు మంత్రి లోకేశ్ కు తెలియజేశారు. ఈ పెట్టుబడి ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, విశాఖపట్నం ఐటీ రంగంలో మరింత అభివృద్ధి సాధించడమే కాకుండా, స్థానికంగా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని అనుమతులు త్వరితగతిన మంజూరు చేసి, ప్రాజెక్టు సకాలంలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

శనివారం 21 జూన్ 2025

# ప్రజలకు సేవలో అపూర్వ శాఖ రెవెన్యూ.

**-తహసిల్దార్ ముక్తేశ్వరరావు.-రిటైర్డ్ తహసిల్దార్లు, ఉద్యోగులకు సత్కారం.**




రావులపాలెం: జూన్ 20, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ప్రజలకు అత్యంత విశ్వసనీయ సేవలందించే శాఖగా రెవెన్యూ వ్యవస్థ నిలుస్తోంది, అని రావులపాలెం తహసిల్దార్ బి.ఎం. ముక్తేశ్వరరావు పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన రెవెన్యూ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ పాలన కాలంలో 1796లో ఏర్పాటైన రెవెన్యూ శాఖ అప్పటినుంచి ప్రజల అవసరాలను తీర్చడంలో, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తోంది. ఆధునిక పరిపాలనలో మానవుల పౌర అవసరాలకు అనుగుణంగా ఈ శాఖ నుంచి కొన్ని విభాగాలు వేరు చేసినా, ముఖ్యమైన ధృవపత్రాల మంజూరులో రెవెన్యూకే ప్రధాన బాధ్యత, అని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో సేవలందించిన రిటైర్డ్ తహసిల్దార్లు కొప్పిశెట్టి దుర్గారావు, తనికెళ్ళ శివానందంలను ఘనంగా సత్కరించారు. అలాగే ప్రస్తుత రెవెన్యూ ఉద్యోగుల్లో ఉత్తమ సేవలందిస్తున్న ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు, వి.ఆర్.ఓలు, వి.ఆర్.ఏలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శ్రీనివాసరావు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వెంకటస్వామి, మండల కన్వీనర్ గుత్తుల పట్టాభిరామారావు, డిప్యూటీ తహసిల్దార్ ఎన్. శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ సూర్యకాంతం, సర్వేయర్ రవిశంకర్, సీనియర్ అసిస్టెంట్ రవి, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత మహిళకు బెదిరింపులు.

**-కోర్టు ఆదేశాల్ని పట్టించుకోని అధికార యంత్రాంగం.-బొబ్బర్లంకలో దళిత మహిళ గిడ్డి అన్నామణి ఆరోపణ.**



ఆత్రేయపురం: జూన్ 20, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

నీవు మా గ్రామంలోకి రాకూడదు. ఇది మా ప్రాంతం అంటూ ఫోన్ చేసి తనను బెదిరిస్తున్నారని గిడ్డి అన్నామణి అనే దళిత మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం లోని ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గ్రామానికి సంబంధించినది ఈ సంఘటన. రాజవరం గ్రామానికి చెందిన అన్నామణి గతంలో బొబ్బర్లంకలో యానిమేటర్‌గా విధులు నిర్వహించారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైసీపీ అనుబంధంగా ముద్ర వేసి తనను తొలగించారని ఆమె తెలిపారు. కోర్టును ఆశ్రయించగా, తిరిగి యానిమేటర్‌గా కొనసాగించాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. అయినా అధికారులు కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా, తాను తిరిగి విధుల్లో చేరకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇటీవల బొబ్బర్లంక గ్రామం లోకి రానివ్వబోమంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి తిట్టి బెదిరించారని, ఆ ఆడియోను మీడియాకు అందించారు. ఇది మా ఊరు నువ్వు రావొద్దు అంటూ ఆమెను హడలెత్తించారని చెప్పారు. ప్రాణహాని ఉందని, తనపై వస్తున్న బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అయినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె వాపోయారు.

# అనపర్తి నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా ఆకుల రామకృష్ణ





రావులపాలెం, జూన్ 20, (తెలుగురాష్ట్రం ప్రతినిధి):

అనపర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకుడిగా రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన ఆకుల రామకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శిగా ఉన్న రామకృష్ణను అనపర్తి నియోజకవర్గానికి రెగ్యులర్ అబ్జర్వర్‌గా నియమిస్తూ పార్టీ అధిష్టానం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు అనపర్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు, కార్యకర్తల సమన్వయానికి నిబద్ధతతో పనిచేస్తానని చెప్పారు. పార్టీ విజయపథంలో ముందుకు సాగేందుకు ప్రతి కార్యకర్తతో కలిసి ముందుకు సాగేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం





కాట్రేనికోన, జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయం లో సామూహిక అక్షరాభ్యాసం,గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సి డి పి ఓ ముదునూరి నిహారిక ఆధ్వర్యంలో అక్షరాభ్యాసము 31 మందికి, గ్రాడ్యుయేషన్ డే 28 పిల్లలకు నిర్వహించినట్లు వారు తెలిపారు.గ్రాడ్యుయేషన్ డే విద్యార్థులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్స్ , అక్షరాభ్యాసం చేసిన వారికి పలకలు, స్లేట్ పెన్సిల్ ఇవ్వడం జరిగిందనీ వారు తెలిపారు.సూపర్వైజర్లు కె వి వి ఎస్ తులసి కుమారి, ఎల్.వి.రమణి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా ఎం పి డి ఓ వెంకటాచలం,ఎంపీపీ కోలాటి సత్యవతి సత్యం, జడ్పిటిసి సభ్యులు నేలా కిషోర్ కుమార్, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిసిన ఎమ్మెల్యే సత్యానందరావు



కొత్తపేట, జూన్ 20, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :

నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా, భక్తజన సందోహంతో అలరారుతున్న కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆహ్వానించారు. శుక్రవారం నర్సీపట్నంలోని స్పీకర్ స్వగృహానికి వెళ్ళిన సత్యానందరావు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అయ్యన్నపాత్రుడికి అందజేసారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు - జిల్లా కలెక్టర్ బాలాజీ




మచిలీపట్నం జూన్ 20, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. రోడ్డు ప్రమాదాల స్థితిగతులు, రహదారులపై బ్లాక్ స్పాట్లకు తీసుకున్న చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ కేసులు, రహదారి భద్రత అవగాహన కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా వాహన చోదకులకు అవగాహన కల్పించాలని, ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్టు తప్పనిసరిగా ధరించే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రహదారులపై బ్లాక్ స్పాట్లను గుర్తించిన బృందం, సమస్యను పరిష్కరించిన అనంతరం కూడా అదే బృందం పర్యటించి అంతా సవ్యంగా ఉన్నట్లు తనకు నివేదించాలన్నారు. 2025 మే నెలలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో మొత్తం 69 రోడ్డు ప్రమాదాలు సంభవించగా, వాటిలో 38 మరణాలు, 80 మంది గాయాలపాలయ్యారని, అత్యధికంగా జాతీయ రహదారులపై 28, రాష్ట్ర రహదారులు 3, ఇతర రహదారులపై 7 మరణాలు సంభవించినట్లు అధికారులు వివరించారు. గణాంకాలు పరిశీలించినప్పుడు సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల పట్ల తీవ్ర ఆవేదన కలుగుతోందని, అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. కానూరు నుండి పెనమలూరు వరకు ఉన్న మచిలీపట్నం%-%విజయవాడ జాతీయ రహదారి డివైడర్ పై రెయిలింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇతర జంక్షన్లు, హైవే నుండి సర్వీస్ రోడ్లు వద్ద స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి సత్వర చికిత్స అందజేసి మరణాల సంఖ్య తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రవాణా అధికారి మనీషా, భారత జాతీయ రహదారుల అధికార సంస్థ పిడి విద్యాసాగర్, మచిలీపట్నం నగరపాలక సంస్థ సహాయ మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, రహదారులు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లోకేష్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్ కుముదిని సింగ్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఏపీఎస్ఆర్టీసీ డీఎం పెద్దిరాజులు, రాష్ట్ర రహదారులు, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ శాఖల్లో తల్లి లాంటిది రెవెన్యూ శాఖ

**- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ - అమలాపురం కలెక్టరేట్ లో ఘనంగా రెవెన్యూ దినోత్సవం**





అమలాపురం, జూన్ 20, (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రభుత్వ శాఖలన్నింటిలోకి రెవెన్యూ శాఖ తల్లి లాంటిదని రెవెన్యూ శాఖకు 45 రకాల ప్రభుత్వ శాఖలతో నిత్యం అను బంధం ఉంటుందని రాను రాను రెవెన్యూ శాఖకు మరింత విశిష్టత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు శుక్రవారం అమలాపురం కలెక్టరేట్ లో రెవెన్యూ దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు 1786 జూన్ 20న ఏర్పాటు చేసిన రెవెన్యూ బోర్డు కాలక్రమంలో రెవెన్యూ శాఖగా రూపాంతరం చెందిందన్నారు. 238 ఏళ్ల తర్వాత ప్రతి ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రెవెన్యూ డే ను మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రెవెన్యూ పరిధిలో ఉత్సవాలు మాదిరిగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రెవెన్యూ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, భూ వ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే ధృవీకరణ పత్రాలు, నీటి పన్ను తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనదని ప్రతి ఉద్యోగి రోజురోజుకు విజ్ఞానాన్ని పెంపొందించుకొని ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు. సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూశాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఎదగాలంటే కీలకమైనది రెవెన్యూ శాఖని, అలాగే దేశంలో కీలకమైన ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలంటే కీలక పాత్ర పోషించేది కూడా ఒక్క రెవెన్యూ శాఖే అన్నారు. రెవెన్యూ దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం రెవెన్యూపై ఉంచిన నమ్మకాన్ని, గౌరవాన్ని మరింత పెంచే విధంగా ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేయగలిగితేనే ఈ వేడుకలు సార్థకం అవుతాయన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖలో ఉత్తమ సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన 44 మంది ఉద్యోగులకు కమాండేషన్ ధృవపత్రాలు, మెమెంటోలు బహుకరించారు. 18 మంది పదవి విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను కలెక్టర్, జేసీ ఘనంగా సత్కరించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.డి.సి జి. మమ్మీ, ఏవో కాశీ విశ్వేశ్వరరావు, రెవెన్యూ శాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు తహసిల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కనకదుర్గమ్మ వారి ఆలయ 40వ వార్షికోత్సవ వేడుకలు





రావులపాలెం, జూన్ 20, (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :

రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలో జాతీయ రహదారి చెంతనే కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో శుక్రవారం 40వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని చలివిడి, వడపప్పు పానకాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహారావు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అమ్మ వారి చిత్ర పటం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ వెలిగట్ల రామకృష్ణ, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిగా దుర్గేష్‌కు ఏడాది



**రాజమహేంద్రవరం, జూన్ 20 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రాష్ట్రపర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్‌కు ఏడాది పూర్తయ్యింది. ఏడాది కాలంగా దుర్గేష్ మంత్రిగా సమర్ధవంతంగా పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కొణిదల పవన్‌కళ్యాణ్‌ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవ చేస్తున్నారు. దుర్గేష్ సారధ్యంలో ఏడాదిలో పర్యాటక రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పర్యాటక రంగంలో అభివృద్ధి వేగం పుంచుకుంది. మంత్రిగా ప్రమాణం చేసి ఏడాది గడిచిన సందర్భంగా దుర్గేష్ స్పందిస్తూ తనను నమ్మి ఇంత పెద్ద బాధ్యత ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ్ంత్రిగా అవకాశం కల్పించిన జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంవత్సర కాలంలో నేర్చుకున్న అనుభవాలు, అందరి ఆశీర్వాదం, సహకారం ఎప్పటికీ మరిచిపోలేనివి అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన పదవీ కాలం ప్రారంభ దశ నుండే ప్రజల ఆశయాలను నిజం చేయడానికి, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడేందుకు నిస్వార్ధంగా అహర్నిశలూ పనిచేస్తున్నాను అన్నారు. ఈ ప్రయాణంలో తనకు తోడుగా నిలిచిన నేతలకి, సహచర మంత్రులకు, అధికార యంత్రాంగానికి, పార్టీ శ్రేణులకు, మీడియా మిత్రులకు, ముఖ్యంగా తనను ప్రేమానురాగాలతో ఎంతగానో ఆదరిస్తున్న ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మీ నమ్మకమే తనకు ప్రేరణ అని, మీ ఆశీర్వాదమే తను బలంగా నిలుస్తోంది అని, మీరు చూపిన ప్రేమ, విశ్వాసానికి న్యాయం చేయడానికి ప్రతి క్షణం ప్రజల కోసమే పనిచేస్తానని, నిస్వార్ధంగా సేవ చేస్తానని తెలియజేశారు.

# ఏలూరులో ఘనంగా రెవిన్యూ డే వేడుకలు





**ఏలూరు, జూన్ 20(తెలుగురాష్ట్రం విలేఖరి):** రెవిన్యూ డే సందర్భముగా శుక్రవారం స్థానిక రెవిన్యూ భవనము, ఏలూరు నందు రెవిన్యూ డే ని ఏ.పి. రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె. రమేష్ కుమార్ ఆధ్వర్యములో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె. రమేష్ కుమార్ మాట్లాడుతూ అన్ని శాఖలకు తల్లి వంటి రెవెన్యూ శాఖ ఔన్నత్యాన్ని మరింతగా పెంచేందుకు, రెవెన్యూ శాఖ గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికి తెలిపేందుకు, ప్రతి రెవెన్యూ ఉద్యోగులలో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ రెవెన్యూ దినోత్సవం జరుపుకుంటున్నాం అని మరియు విశ్వ వ్యాప్తం గా రెవెన్యూ శాఖకు గుర్తింపు పొందడం కోసం మన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కృషి అమోఘం అని తెలియజేశారు. జిల్లా కలక్టర్ స్థాయి నుండి వీఆర్ఏ స్థాయి వరకు రెవిన్యూ ఉద్యోగి అహర్నిశలు పని చేస్తూ ప్రజలకు సేవ చేస్తుంటారని రానున్న రోజుల్లో రెవెన్యూ డే దినోత్సవ వేడుకలు మరింత విస్తృతం అయ్యి, అనేక కొత్త పుంతలు తొక్కాలని కె. రమేష్ కుమార్ తెలియజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రోత్సహకరముగా రెవిన్యూ డే ని జరుపుకోవడానికి బడ్జెట్ రిలీస్ చేసినందుకు దన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యకరములో ఏ. ప్రమోద్ కుమార్, సెక్రెటరీ, ఏ.పి. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏలూరు జిల్లా మాట్లాడుతూ రాత్రనక, పగలనక శ్రమించే రెవిన్యూ ఉద్యోగులు ప్రజలకు సమర్ధవంతమైన సేవలను అందించే కృత్యంలో పునరంకితం అవుతారని ఆశిస్తూ సదరు రెవిన్యూ డే సందర్భముగా రిటైర్డ్ అయ్యిన ఉద్యోగులను ఘనంగా దుశాలువులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెట్టు మోహన్ రావు, జగన్ మోహన్ రావు, గణేశ్వర రావు, చంద్ర శేఖర్, జి.వి. సుబ్బా రావు, రాజశేఖర్, రామకృష్ణ, టెన్నీ, ఆదిల్, అమెన్సిల, సుబ్బా రావు. రవిచంద్ర రావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్, కృష్ణ స్వామి ఏలూరు డివిజన్ ప్రెసిడెంట్, మాధవి జిల్లా జాయింట్ సెక్రటరీ, నాయక్, జిల్లా ఒర్గినైసింగ్ సెక్రటరీ, గాయత్రి, ఏలూరు తహసిల్దార్, మరియు రెవిన్యూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్తమ తహసీల్దార్ గా విజయ ప్రసాద్

**మచిలీపట్నం జూన్ 20(తెలుగురాష్ట్రం విలేఖరి):**



ఘంటసాల మండల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ ఉత్తమ తహసీల్దార్ గా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ చేతులు మీదగా ప్రశంసా పత్రం శుక్రవారం అందుకున్నారు. ఘంటసాల మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో నాణ్యమైన సేవలందిస్తూ ప్రజా ప్రతినిధులు, ప్రజలు మన్ననలు పొందుతున్న తహసీల్దార్ విజయ ప్రసాద్ ఉత్తమ తహసీల్దార్ గా ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల ఘంటసాల మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలియజేశారు.

# యోగ ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి.

## -ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచన.



**ఏలూరు, జూన్ 20,(తెలుగురాష్ట్రం విలేఖరి):** మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి నేపథ్యంలో సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరి జీవితంలో యోగ భాగం కావాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిత్యం ఉదయం పూట యోగాసనాలు సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి ప్రశాంతత లభిస్తుందని ఎంపీ వెల్లడించారు. ప్రస్తుత యాంత్రికరణ జీవితంలో దీర్ఘకాలిక రుగ్మతల నుంచి ఉపశమనం లభించడానికి యోగ దివ్య ఔషధంగా పనిచేస్తుందని ఎంపీ తెలిపారు. నిపుణుల పర్యవేక్షణలోనే యోగాసనాల సాధన చేయాలని, తద్వారా ఆయువు ప్రమాణాలు పెంచుకోవాలని ఎంపీ సూచించారు. యోగ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించేలా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 2014లో జరిగిన యూఎన్ ప్రసంగంలో చొరవ తీసుకున్నారని, దీనికి సంబంధించిన తీర్మానానికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత మద్దతు లభించిందని ఎంపీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 177 దేశాలు దీనికి మద్దతు ఇచ్చిన విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. అనంతరం న్యూయార్క్, పారిస్, బీజింగ్, బ్యాంకాక్, కౌలాలంపూర్, సియోల్, ఢిల్లీతో సహా ప్రపంచవ్యాప్తంగా మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 21 జూన్ 2015న విజయవంతంగా నిర్వహించారని ఎంపీ తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని చరిత్రలో నిలిపేలా విశాఖపట్నం వేదికగా ఏర్పాట్లు చేసిందని ఎంపీ పేర్కొన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరు తమ వివరాలను ఈ క్రింద ఇచ్చిన సైట్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

# జాతీయ రహదారుల నిర్మాణంపై సమీక్ష.

## -అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



**ఏలూరు, జూన్ 20,(తెలుగురాష్ట్రం విలేఖరి):** జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ, తదితర సమస్యలను అధిగమించి త్వరితగతిన రహదారుల నిర్మాణం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం పలు జాతీయ రహదారుల నిర్మాణం, భూసేకరణకు సంబంధించి సంబంధిత అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టిసీమ-జీలుగుమిల్లి 365 బి.బి. 40 కి.మీ. రహదారికి సంబంధించి త్వరగా భూసేకరణ చేసి నిర్మాణ దారులకు స్వాధీనం చేయాలని ఆదేశించారు. మిగిలిన రైతులను సమన్వయంచేసి భూమి సేకరించి సకాలంలో నష్టపరిహారం అందించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి తహశీల్దార్లను ఆదేశించారు. అదే విధంగా ఖమ్మం, దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి సంబంధించి ఆయా అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబధించి రైతులకు నష్టపరిహారం త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని కొవ్వూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు. కొయ్యిలగూడెం పరిధిలోని రైతులకు పరిహారం చెల్లించి రోడ్డునిర్మాణానికి అవసరమైన భూమిని నిర్మాణదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని రాజమండ్రి ఎన్.హెచ్. ప్రాజెక్ట్ డైరెక్టర్ ను ఆదేశించారు. పామర్రు, ఆకివీడు 165 జాతీయ రహదారికి సంబంధించి గోనేపాడు వద్ద ఆర్వోబి నిర్మాణానికి అవసరమైన భూమి విషయంలో రైతులతో సమన్వయం చేసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్డిఓ, కైకలూరు తహశీల్దారను ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, ఎన్.హెచ్ అధికారులు పలువురు తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కర్ణుడు కంటే గొప్ప వ్యక్తి డా బిఆర్ అంబేడ్కర్

## -ఆంధ్రప్రదేశ్ బహుజన జెఏసి 4వ ఆవిర్భావ దినోత్సవ సభలో రాజ్యసభ సభ్యులు పాక



**భీమవరం జూన్ 20, (తెలుగురాష్ట్రం విలేఖరి):** కర్ణుడు కంటే గొప్ప వ్యక్తి డా బిఆర్ అంబేడ్కర్ అని రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ అన్నారు. భీమవరం అంబేడ్కర్ భవన్ లో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ బహుజన జాయింట్ యాక్షన్ కమిటి 4వ ఆవిర్భావ దినోత్సవ సభను నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సభలో రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని, ఆయన ఆశయాలతో ఆంధ్రప్రదేశ్ బహుజన జాయింట్ యాక్షన్ కమిటి ఏర్పాటు అభినందనీయమన్నారు. బిజెపి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, కోడె విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ పట్టణ ఇన్ ఛార్జ చినిమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ గత 4 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ బహుజన జాయింట్ యాక్షన్ కమిటి ఎన్నో పోరాటాలు, ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ బహుజన జాయింట్ యాక్షన్ కమిటి ఫౌండర్ తాళ్లూరి మధు మాట్లాడుతూ సభ్యుల సంక్షేమం, తోడ్పాటు తోపాటు సభ్యుల కష్టసుఖాల్లో పాలు పంచుకోవడమే మా లక్ష్యమని అన్నారు. దళితులపై దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై అందరం కలిసి పోరాడతామని అన్నారు. అనంతరం పేద మహిళలకు చీరలను పంపిణీ, అంబేడ్కర్ ఆశయాల కోసం కృషి చేస్తున్న వారిని సత్కరించారు. కార్యక్రమంలో కోడె యుగంధర్, గాదిరాజు రామరాజు, ఆంధ్రప్రదేశ్ బహుజన జాయింట్ యాక్షన్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# శానిపల్లంక వద్ద రైల్వే లైన్ ను పరిశీలించిన ఎంపీ హరీష్





**పి గన్నవరం, జూన్ 20 (తెలుగు రాష్ట్రం విలేకరి) :** నియోజకవర్గ పరిధి లోని అయినవిల్లి మండలం శానిపల్లంక వద్ద కోనసీమ రైల్వే లైన్ కోసం జరిగిన పనులను అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తో కలిసి పరిశీలించారు.రైల్వే లైన్ లో భూములు ఉన్న రైతులతో సమావేశమయ్యారు.బాధిత రైతులకు న్యాయం చేసి రైల్వే లైన్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.రైల్వే లైన్ కోసం కోనసీమలో ఉన్న నదులలో దాదాపుగా పిల్లర్స్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు.వీటిపై నిర్మించే సూపర్ స్ట్రక్షర్ నిర్మాణానికి రైల్వే శాఖ టెండర్ పిలిచిందని కాంట్రాక్టు అవార్డు కూడా ఖరారు అయ్యిందని చెప్పారు. ఈ పనులు చేసేందుకు ఉన్న అడ్డంకులు తొలగించేందుకు దృష్టి సారించామని హరీష్ వివరించారు.భూ సేకరణకు ఉన్న అడ్డంకులను ప్రక్రియ కూడా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం అమలాపురంలోని ఎంపీ నివాసం వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో హరీష్ సమావేశం నిర్వహించారు.రైల్వే పనులు పూర్తి చేయడానికి రెవెన్యూ అధికారుల పూర్తి సహకారం చేస్తారని అలాగే నా వైపు నుండి కూడా పూర్తి సహకారం ఉంటుందని రైల్వే శాఖ అధికారులకు ఎంపీ హరీష్ బాలయోగి వివరించారు. ఈ సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఎ బద్దయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి అర్జున్ రావు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజానికి యోగా కేంద్ర బిందువు

## - సీనియర్ సివిల్ జడ్జ్ రామకృష్ణయ్య



**మచిలీపట్నం:జూన్ 20 (తెలుగు రాష్ట్రం విలేకరి) :** ఈ నెల 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా యోగా పై దృష్టి కేంద్రీకరించడం శుభ పరిణామం అని కృష్ణా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగ సభ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని వాకర్స్ క్లబ్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి రామకృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణంలో మనుషుల పరివర్తనలో మార్పు కోసం యోగా కేంద్ర బిందువుగా పని చేస్తుందని అన్నారు. ప్రతి కుటుంబంలో యోగ దైనందిక కార్యక్రమంగా రూపొందించుకోవాలని సూచించారు. ఐదువేల సంవత్సరాల క్రితం ఋషులు అందించిన యోగ నేడు ప్రపంచానికి మార్గదర్శకం అయిందని, అందుకు భారతీయులందరూ గర్వించాలని అన్నారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికా సమస్య యొక్క కార్యక్రమాలను చట్టాల యొక్క ఆవశ్యకతను న్యాయమూర్తి వివరించారు దేశ స్థాయిలో రాష్ట్ర స్థాయిలో జిల్లా స్థాయిలో మండల స్థాయిలో ఉచితంగా న్యాయాన్ని అందిస్తున్నట్లుగా తెలియజేశారు. టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఉచితంగా కూడా సలహాలు ఇస్తున్నట్లు రామకృష్ణ తెలియజేశారు.మరో ముఖ్య అతిథి మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ యోగా ద్వారా జీవితంలో నూతన ప్రక్రియ మొదలవుతుందని అన్నారు. ప్రతిరోజు ప్రాణాయామం ఆసనాలతో అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని అన్న రు. రాష్ట్ర ప్రభుత్వం హై స్కూల్ స్థాయిలో యోగాని పాఠ్యాంశంగా రూపొందించాలని బాలాజీ అన్నారు. సంవత్సరంలో ఎక్కువకాలం సూర్యుడు ఉండే జూన్ 21ని యోగ దేగ నిర్ణయించారని, ఉభయ తెలుగు రాష్ట్రాలు గర్వించే విధంగా కోట్లాదిమంది ప్రజలతో యోగాడే కార్యక్రమాలు పండగ వాతావరణ సృష్టించాయని బాలాజీ అన్నారు. యోగ డే అందరికీ పండగే అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగ సభ గురువులు ఘంటసాల గుర్నాధ్ బాబు, మద్దాల చింతయ్య యోగ కార్యక్రమాలను నిర్వహించి వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం. వెంకటేశ్వర్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ యోగా డే ప్రతీనిధులు రామిశెట్టి దుర్గాప్రసాద్, యర్ర జగన్మోహన్ రావు, ఆంధ్రప్రదేశ్ యోగ సభ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం యోగ సభ సభ్యులు ముఖ్య అతిథులను సన్మానించారు.

# మానసిక ఒత్తిడిని అధిగమించడానికి ఏకైక మార్గం యోగా- ఎస్పీ ఆర్.గంగాధరరావు



**మచిలీపట్నం:జూన్ 20 (తెలుగు రాష్ట్రం విలేకరి)** మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా సాధన ఏకైక మార్గం అని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన కృష్ణాజిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ నిరంతర యోగ సాధన చేయడం జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని సూచించారు. మన పూర్వీకుల ద్వారా మనకు సంక్రమించిన యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ యోగ సాధన చేస్తూ పరిపూర్ణ ఆరోగ్యాన్ని సంపాదించుకోవాలని ఎస్పీ తన ప్రకటనలో తెలిపారు.

# ప్రభుత్వ బాలికల ఇంటర్ కళాశాల ద్వారా ఉచిత విద్యాబోధన



**జగ్గయ్యపేట, జూన్ 20 (తెలుగురాష్ట్రం విలేకరి):** పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి పూర్తి చేసుకున్న బాలికలు ఉన్నత చదువు, డ్రాప్ అవుట్ కాకుండా ఉండటానికి 3 సంవత్సరాల క్రితం నుండి పేద విద్యార్థులకు ఉచితంగా ఇంటర్మీడియట్ చదవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కాలేజీని ప్రారంభించడం జరిగింది. ఇప్పటికే మొదటి, రెండో సంవత్సరం తాలూకా పూర్తి చేసిన వారిలో మొదటి బ్యాచ్ లో 85 శాతం ఉత్తీర్ణత సాధించారని, దీనిలో యంపిసి లో 788, బైపిసిలో 775 మార్కులు సాధించారని, వీరు ఎంసెట్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయురాలు కె హేమమాధురి తెలియజేశారు. ఇప్పటికే ఇంటర్ మొదటి సంవత్సరంలో 28 మంది, ద్వితీయ సంవత్సరం లో 17 మంది విద్యార్థులు చదువుతున్నారని అధ్యాపకులు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి బాలికలకు తల్లికి వందనం, యూనిఫాం, టెక్స్ట్ మరియు నోట్ బుక్స్ లను వారికి కావలసిన ఐఐటి, ఎంసెట్ బుక్స్ లను ఉచితంగా అందించడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయురాలు తెలియజేశారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు భారం అవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి ఉచిత విద్యను అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. జగ్గయ్యపేట పట్టణం మరియు చుట్టుప్రక్కల చదువుకునే పేద విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను సద్వినియోగ పరుచుకోవాలని చదువుకుంటున్న బాలికలు పత్రికా ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిజిటి అధ్యాపకులు వార్త అరుణ, బి. కరుణాకర్ రెడ్డి, ఆర్ శివయ్య, గార్లపాటి చంద్రశేఖర్, భూక్యా సైదా నాయక్, యన్ ఆర్ పి యస్ రెడ్డి, యం. హనుమంతరావు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారని సామాజికవేత్త మెటికల శ్రీనివాసరావు తెలిపారు.

# ఎకో జోన్ ను వ్యతిరేకిస్తూ గ్రామసభ తీర్మానం

**వి.ఆర్.పురం, జూన్ 20 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



పాపికొండల నేషనల్ పార్క్ కు అనుబంధంగా ఎకో సెన్సిటివ్ జోన్ పేరిట రేఖపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అన్నవరం, ఉమ్మడివరం, రేఖపల్లి,గ్రామాలలో ఫారెస్ట్ అధికారులు మరియు గ్రామపంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించడం జరిగినది. ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ఎకో సెన్సిటివ్ జోన్ పేరిట పాపికొండల నేషనల్ పార్కు కు అనుబంధంగా మీ గ్రామపరిసరాలలో ఉన్న భూమిని కొంత భాగం సేకరించడం గ్రామసభ లక్ష్యమని గ్రామస్తులు అందరూ అంగీకారం మేరకే ఈ సభ తీర్మానం చేస్తుందని తెలియపరచడం జరిగింది. ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ ఎకోజోన్ పేరిట గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని తెలియపరచడం జరిగింది. అధికారులు చెప్పిన చదివి వినిపించిన విషయాలన్నీ గమనించిన స్థానిక గ్రామాల గిరిజన ప్రజలు ఓ ప్రక్క పోలవరం ప్రాజెక్టు లో కొద్ది భూమి మునిగి పోతుంటే మరో ప్రక్క ఎకో సెన్సిటివ్ జోన్ పేరిట ఫారెస్ట్ అధికారులు భూమిని సేకరించడానికి ప్రయత్నించడం పద్ధతి కాదని, ఏజెన్సీ ప్రాంతం అయిన మా గ్రామాలలో అటవీ హక్కుల చట్టం అమలులో ఉందని ఈ భూమిపై ఈ అటవీపై గిరిజనులుగా మాకు ఎంతో హక్కు ఉందని అన్నారు. ఇప్పటికే పాపికొండల నేషనల్ పార్క్ పేరిట ఎన్నో రకాల షరతులు విధిస్తూ అడవులలో అటవీ సంపదను సేకరించడం కూడా నేరమేనంటూ జులూమ్ చేస్తున్న ఫారెస్ట్ అధికారులు ఎకోజోన్ పేరిట మాభూములుసేకరించడానికిప్రయత్నించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఈ గ్రామ సభలో ఎకో జోన్కు వ్యతిరేకంగా గ్రామసభ తీర్మానం చేయాలని ఆయా గ్రామాల ప్రజలందరూఏకగ్రీవంగా నిర్ణయించి తీర్మానించడం జరిగింది. ఈ గ్రామ సభల్లో గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, ఉప సర్పంచ్ పాయం లక్ష్మణరావు, పిసా కమిటీ ఉపాధ్యక్ష ,కార్యదర్శులు సారా. పాంద్రాజు, వేటగాని. సూరి పాయం.సుబ్బారావు,సోయం.జోగారావు, బురక మారయ్య, సోడి దినేషా, వన సంరక్షణ సమితి నాయకురాలు సోడి వెంకమ్మ వార్డు మెంబర్లు,ఫారెస్ట్ అధికారులు శ్రీరామ్, పలు గిరిజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.ఎస్.యు.ఐ.లో చేరిన వివిధ కళాశాలల విద్యార్థులు



**రాజమహేంద్రవరం, జూన్ 20(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** తూర్పుగోదావరిజిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్.ఎస్.యు.ఐ.లో చేరారు.మోటారు సైకిళ్ళ మీద ర్యాలీగా వచ్చిన 95 మంది విద్యార్థులు మున్సిపల్ కాలనీలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టీ.కే. విశ్వేశ్వర రెడ్డి సమక్షంలో ఎన్.ఎస్.యం.ఐలో చేరారు. విశ్వేశ్వరరెడ్డి వారందరికీ కండువాకప్పి ఎన్.ఎస్.యు.ఐ.లోకి ఆహ్వానించారు.అనంతరం టి.కె.మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఉన్నత స్థాయి నాయకులందరూ వారి రాజకీయ ప్రస్థానం ఎన్.ఎస్.యు.ఐ.నుండే మొదలుపెట్టిన వారేనని ఇప్పుడు చేరిన విద్యార్థులంతా భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ఎన్.ఎస్.యు.ఐ.తరుపున పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఎన్.ఎస్.యు.ఐ. అధ్యక్షులుగా ముప్పిడి గోవింద్ అలియాస్ చెర్రీ, రాజమండ్రి రూరల్ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులుగా సమర్థకుర్తి నాగ దుర్గారావు, రాజానగరం ఎన్.ఎస్.యు.ఐ. అధ్యక్షుడిగా వి. సత్య సాయిరాం అలియాస్ సాయి లను నియమించారు.

# పోలవరంలో కాపర్ డ్యాం డీవాటరింగ్ పనులు ప్రారంభం



**పోలవరం, జూన్20(తెలుగు రాష్ట్రం విలేకరి):** పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన ఎర్త్ కం రాక్ఫిల్ డ్యాం పనుల నిర్మాణానికి అనువుగా ఎగువ దిగువ కాపర్ డ్యాం నడుమ ఉన్న సీపేజీ జలాలను దిగువ కాపర్ డ్యాం నుండి దిగువకు తోడి పోసే పనులను గురువారం జలవనరులశాఖ అధికారులు మెగా ఇంజనీరింగ్ అధికారులు శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. ప్రాజెక్టు ఇఇ డి శ్రీనివాస్, మెగా జిఎం గంగాధర్ ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 45 మీటర్ల ఎత్తున నిర్మించిన ఎగువ కాపర్ డ్యాం 35 మీటర్ల ఎత్తున నిర్మించిన దిగువ కాపర్ డ్యాం నడుమ కిలోమీటరు వీస్తీర్ణంలో కొంతమేర సీపేజీ జలాలు నిల్వ ఉన్నాయి. గ్యాప్ 1 కాంక్రీట్ పనులు చేయాలంటే రెండు కాపర్ డ్యాంల నడుమ నీటి మట్టం తక్కువగా ఉండాలని ప్రస్తుతం ఆ ప్రాంతంలో నీటిమట్టం 16 మీటర్ల కంటే ఎక్కువగా ఉందని, నీటిమట్టం 15 మీటర్ల కంటే తక్కువకు చేరేవరకూ నీటిని తోడకం జరుగుతుందని అనంతరం గ్యాప్ 1 నిర్మాణపు పనులు చేపట్టడం జరుగుతుందని ఇఇ శ్రీనివాస్ తెలిపారు. ఈ సీజనులో గ్యాప్ 1 ఇతర నిర్మాణాలకు ఎలాంటి ఆటంకం లేకుండా నీటిని తోడిపోసేందుకు 80 ఆశ్వ సామర్థ్యం కలిగిన 180 మోటార్లను వినియోగించనున్నారు. ప్రస్తుతం 86 మోటార్లను డీవాటరింగ్ పనుల కోసంసిద్ధం చేయగా 15 మోటార్లతో నీటి తోడకం పనులు ప్రారంభించినట్లు, క్రమక్రమంగా మోటార్ల సంఖ్య పెంచుతూ డీవాటరింగ్ చేయనున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలి పారు. గ్యాప్ 1 నిర్మాణపు పనులకు అవసరమైన మట్టి తవ్వకం పనులు గ్యాప్ 1 ప్రాం తంలో వేగవంతంగా జరుగుతున్నాయి.

# బ్యాక్ వాటర్ తో ముంపు గ్రామాల్లో వరద భయం

**వి ఆర్ పురం, జూన్ 20 (తెలుగు రాష్ట్రం విలేఖరి):**



పోలవరం బ్యాక్ వాటర్ తో మళ్ళీ ముంపు గ్రామాల్లో వరద భయం మొదలైంది. జూలై ఆగస్టు సెప్టెంబర్ నెలలో కురిసే భారీ వర్షాలకు బ్యాక్ వాటర్ పోటు తోవరద ముంపు భారీ ఎత్తున ఉండే అవకాశాలు ఉంటాయా అని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల నిర్వాసితులు భయాందోళనతో పునరావాస కేంద్రాలలో తలదాచుకునేందుకు ఇల్లు పూర్తవకుండానే వెళ్ళిపోతున్నారు . వరదల ఈ సంవత్సరం కూడా అత్యధిక మంది నిర్వాసితులు సమీప గుట్టల్లోనే పాకలు వేసుకొని ఉండేలా కొన్ని గ్రామాల్లో గోదావరి నది తీర గ్రామాల్లో ఏర్పాట్లు చేసుకుంటున్నారు ప్రభుత్వం శరవేగంగా పునరావాస ప్రక్రియ పనులు పూర్తిచేస్తే మేము కాలనీలోకి వెళ్ళటానికి సంసిద్ధంగా ఉన్నా ము, మరి ప్రభుత్వం పూర్తి చేస్తుందా? లేదా? అనే అనుమానంతో నిర్వాసితులు ఉన్నారుప్రతిఏటా ఇక్కడ ఉండి వరదలతో బాధలు పడలేమని నిర్వాసిత కాలనీలలో శరవేగంగా పనులను ప్రారంభించి పూర్తి చేయాలని పోలవరం నిర్వాసితులు కోరుతున్నారు.

# తాసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే కార్యక్రమం

**పోలవరం, జూన్ 20 (తెలుగు రాష్ట్రం విలేకరి):** ఏలూరు జిల్లా పోలవరం మండలం పోలవరం గ్రామం లో రెవిన్యూ డే సందర్భంగా




తాసిల్దార్ కార్యాలయం లో ఎమ్ అర్ ఓ ఆద్వర్యం లో రెవిన్యూ డే సదస్సు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎంపీపీ ఛాంబర్ అధ్యక్షులు పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి ఈ కార్యక్రమ లో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా కూటమి నాయకులు గుణపర్తి చిన్ని, బొడ్డు కృష్ణ మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ ఎస్ ఐ పవన్ కుమార్ పాల్గొని వారి సందేశాన్ని ఇచ్చారు ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. పదవి విరమణ చేసిన రెవెన్యూ సిబ్బందిని ఘనంగా సత్కరించారు.

# యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

## -ఎమ్మెల్యే అమిలినేని



**కళ్యాణదుర్గం, జూన్ 20 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళ్యాణదుర్గం పట్టణం కరణం చిక్కప్ప క్రీడా మైదానములో ఉదయం 5.30 గంటలకు నిర్వహిస్తున్న యోగాంధ్రను విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు తెల్లటి దుస్తులు ధరించి పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# అక్రమ అరెస్టులు మానుకోవాలి

## -మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ అరెస్టు -రాష్ట్ర కార్యదర్శి ఆవుల మరియాదాస్



**వి ఆర్ పురం, జూన్ 20 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ అరెస్టు ని ఖండిస్తూ, మండలంలోని జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు అధ్యక్షతన మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు ఇంటివద్ద పత్రిక సమావేశం ఏర్పాటు చెయ్యటం జరిగింది. ఈ సందర్భంగా వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల మరియాదాస్ మాట్లాడుతూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని లిక్కర్ కేస్ లో కావాలనే అక్రమంగా అరెస్ట్ చేసారని, లిక్కర్ స్కాం కి అతనికి ఎటువంటి సంబంధం లేదని, వైస్సార్సీపీ లో చురుకుగా వుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, అలాగే పార్టీ అనుబంధ సంఘాల కు ఆర్గనైజర్ గా ఉన్నదని, ఆయనను అరెస్ట్ చేసారని వారన్నారు.ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి ప్రతిపక్ష నాయకులను అక్రమ అరెస్ట్ లు చెయ్యటానికి ఈ కూటమి ప్రభుత్వం ఎక్కువ సమయం కేటాస్తుందని ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని... రానున్న రోజులలో కూటమి ప్రభుత్వం కి పరభావం తప్పదన్నారు. ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, యస్ సీ సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, ఆర్. టి. ఐ. విభాగం అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, శ్రీరామగిరి దేవస్థానము మాజీ చైర్మన్ రేవు బాలరాజు, వడ్డీగూడెం దేవస్థానం మాజీ చైర్మన్ ముత్యాల సాయి,రాజుపేట ఉపసర్పంచ్ ముంజుపు రాము, ముత్యాల శ్రీధర్, మోడెం నరేష్,రెడ్డిమల్ల శ్రీనివాస్, రేవు పోసి, బొర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు నిర్మాణం చేయండి



**టీ.నర్సాపురం, జూన్20 (తెలుగు రాష్ట్రం విలేఖరి):** చింతలపూడి టీ నర్సాపురం ప్రధాన రహదారితో పాటు టీ నర్సాపురం మండల రోడ్లకు మోక్షం కల్పించాలని కోరుతూ టీ నర్సాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త సింగరేణి మాజీ ఉద్యోగి సేవా రత్న జాతీయ అవార్డు గ్రహీత యస్ డి నా సర్ పాషా శుక్రవారం నాడు ఏలూరు జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి ధాత్రి రెడ్డి (ఐఏఎస్) కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి నుండి టీ నర్సాపురం వరకు కలిపే ప్రధాన రహదారి ప్రస్తుతం వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉందనీ గుంతలు, ధ్వంసమైన పొరల కారణంగా వాహనదారులు తీవ్రమైన అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారన్నారు. రోజూ ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలకు ఇది ఒక అసాధ్యమైన కష్టంగా మారిందన్నారు. కావున తక్షణమే రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, వీలైనంత త్వరగా రోడ్డు వెడల్పునూ పెంచాలని మనవి చేస్తున్నామన్నారు. అదేవిధంగా టీ నర్సాపురం మండల కేంద్రం నుండి బంధం చర్లకు వెళ్లే ప్రధాన రహదారి నాలుగు కిలోమీటర్ల పొడవున కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదనీ దీంతో అంబేద్కర్ సెంటర్ నుండి టి నరసాపురం సినిమా హాల్ సెంటర్ వరకు పంట కాలువను తలపించే విధంగా రోడ్లపైనే వరద నీరు నిలబడుతోందన్నారు, వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థ లేదనీ దీంతో రోడ్డు బురదమయం అవు తోందని వాహనాల రాకపోకలకు కాలినడకకు కూడా ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు దయచేసి ఈ సమస్యను కూడా పరిష్కరించడంతో పాటు మండల పరిధిలోన గండిగూడెం, మక్కినవారిగూడెం, లక్ష్మీపురం రోడ్లు కూడా అభివృద్ధి చేయాలని కోరుతున్నాము. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని వర్షాకాలం ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా టీ నర్సాపురం ఎర్ర చెరువు ముంపు నివారణ చర్యలు చేపట్టాలి, టి నర్సాపురం ప్రాథమిక కల్పించాలి ఆసుపత్రి ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ అమలు చేయాలనీ కోరారు.

# యోగతోనే ఆరోగ్యం-ఆర్డీఓ వసంత బాబు




**కళ్యాణదుర్గం, జూన్ 20 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** యోగతో నే ఆరోగ్యం అని ఆర్డీఓ వసంత బాబు అన్నారు.కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీఓ వసంతబాబు. సర్పంచ్ శోభారాణి, ఉపసర్పంచ మల్లికార్జున, యోగామాస్టర్ నబీరసూల్, విఆర్ఓ జవహర్బాష, కార్యదర్శి నవీన్, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులతో కలిసి ఆర్డీఓ యోగాసనాలు చేసారు. యోగాతో అందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆర్డీఓ చెప్పారు..అలాగే శనివారం ప్రపంచ యోగాదినొస్థవంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ధోని, విరాట్‌ల సరసన శుభ్మన్ గిల్..

## సక్సెస్ ఫుల్ కెప్టెన్‌గా మారే ఛాన్స్.. కారణం ఏంటో తెలుసా?

రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత, శుభ్‌మన్ గిల్‌ను భారత టెస్ట్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా నియమించారు. ఈసారి గిల్ నాయకత్వంలో, భారత జట్టు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ లేకుండా ఇంగ్లాండ్‌తో పోటీ పడనుంది. ఈ అనుభవజ్ఞులైన ఆటగాళ్లు జట్టులో లేకపోవడం కొత్త కెప్టెన్‌పై ఒత్తిడిని పెంచుతోంది. కానీ అతను దాని గురించి పెద్దగా ఆందోళన చెందడం లేదు. అతను యువ ఆటగాళ్లపై పూర్తి నమ్మకం కలిగి ఉన్నాడు. దీంతో పాటు మరొక యాదృచ్ఛికం ఉంది. దాని కారణంగా గిల్ విజయవంతమైన కెప్టెన్‌గా మారగలడు. ఇది గతంలో మహేంద్ర సింగ్ ధోని, విరాట్ కోహ్లీ విషయంలో జరిగింది. ఇప్పుడు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ విషయంలో కూడా అదే యాదృచ్ఛికం జరగబోతోంది.



### ఆ యాదృచ్ఛికం ఏమిటంటే?

2020లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్ ద్వారా అరంగేట్రం చేసిన శుభగన్ గిల్ ఇప్పటివరకు టీం ఇండియా తరపున 32 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. తన కెరీర్‌లో 33వ మ్యాచ్‌లో అతను టీం ఇండియాకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. అంతకుముందు, మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ 32 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన తర్వాత 33వ మ్యాచ్‌లో కూడా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. నేడు వారిద్దరూ భారత జట్టుకు అత్యంత విజయవంతమైన కెప్టెన్ల జాబితాలో చేరారు.

ఇప్పుడు ఈ యాదృచ్ఛికం శుభ్‌మన్ గిల్ విషయంలో కూడా జరిగింది. అటువంటి పరిస్థితిలో, అతను విజయవంతమైన కెప్టెన్‌గా కూడా మారగలడు. కానీ, ఇందుకోసం ఆటగాళ్లను బాగా రాణించేలా ప్రేరేపించాల్సి ఉంటుంది. దీంతో పాటు, అతను స్వయంగా బ్యాట్‌తో భారీగా పరుగులు సాధించాల్సి ఉంటుంది. శుభ్‌మన్ గిల్ 32 టెస్ట్ మ్యాచ్‌ల్లో 35.05 సగటుతో 1893 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 7 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గతంలో, విరాట్ కోహ్లీ, మహేంద్ర సింగ్ ధోని నాయకత్వంలో టీం ఇండియా అద్భుతంగా రాణించింది.

### కెప్టెన్‌గా ధోని, విరాట్ ప్రదర్శన ఎలా ఉంది?

భారత జట్టులో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరైన మహేంద్ర సింగ్ ధోని, విరాట్ కోహ్లీ 32 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన తర్వాత జట్టును నడిపించారు. ఆ తర్వాత మహేంద్ర సింగ్ ధోని 60 టెస్ట్ మ్యాచ్‌లలో జట్టును నడిపించారు. అందులో జట్టు 27 గెలిచి 18 ఓడిపోయింది. 15 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి.

విరాట్ కోహ్లీ 68 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. వాటిలో 40 మ్యాచ్‌లలో అతను గెలిచాడు. 17 మ్యాచ్‌లలో అతను ఓటమి పాలైతే, 11 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. శుభ్‌మాన్ గిల్ తన కెప్టెన్సీలో టీమ్ ఇండియాను ఎంతవరకు ముందుకు తీసుకెళ్తాడో చూడాలి.

# 18 ఏళ్ల వసీం అక్రమ్ కెరీర్‌కు 7 ఏళ్లలోనే ఇచ్చిపడేసేందుకు సిద్ధమైన బుమ్రా

## బద్దలవ్వనున్న భారీ రికార్డ్

లీడ్స్ లో ఇంగ్లాండ్ తో జరిగే తొలి టెస్ట్ లో జస్ప్రీత్ బుమ్రా మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు, అతను మరోసారి మ్యాచ్ విన్నింగ్ స్పెల్ లను బౌలింగ్ చేస్తాడని భావిస్తున్నారు. లీడ్స్ ఫాస్ట్ పిచ్ పై జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లాండ్ బ్యాటింగ్ యూనిట్ ను నాశనం చేయగలడనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ టెస్ట్ లో జస్ప్రీత్ బుమ్రా అత్యధిక వికెట్లు తీస్తే, ఎవరూ ఆశ్చర్యపోరు. ఈ టెస్ట్ మ్యాచ్ లో బుమ్రా 5 వికెట్లు తీస్తే, అతను తన పేరు మీద ఒక రికార్డును సృష్టిస్తాడు. అది నిజంగా అద్భుతంగా ఉంటుంది. పాకిస్తాన్ జట్టు అభిమానులు గర్వించే వసీం అక్రమ్ రికార్డును జస్ప్రీత్ బుమ్రా బద్దలు కొట్టే అవకాశం ఉంది.



### అక్రమ్ రికార్డును బద్దలు కొట్టనున్న బుమ్రా..

దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలలో అంటే SENA దేశాలలో అత్యధిక వికెట్లు తీసిన ఆసియా బౌలర్‌గా నిలిచేందుకు జస్ప్రీత్ బుమ్రా వాస్తవానికి కేవలం 5 వికెట్ల దూరంలో ఉన్నాడు. SENA దేశాలలో బుమ్రా మొత్తం 145 వికెట్లు తీసుకున్నాడు. వసీం అక్రమ్ (146) అతని కంటే ఎక్కువ వికెట్లు తీసుకున్నాడు. అంటే బుమ్రా రెండు వికెట్లు తీసిన వెంటనే, బుమ్రా లెజెండరీ పాకిస్తానీ బౌలర్‌ను అధిగమిస్తాడు. అతను 5 వికెట్లు తీసిన వెంటనే, SENA దేశాలలో 150 వికెట్లు తీసిన మొదటి ఆసియా బౌలర్‌గా అవతరిస్తాడు.

### SENA దేశాలలో జస్ప్రీత్ బుమ్రా అద్భుతాలు..

వసీం అక్రమ్ 55 ఇన్నింగ్స్‌లలో మొత్తం 146 వికెట్లు పడగొట్టాడు. జస్ప్రీత్ బుమ్రా %ాజుచీూ% దేశాలలో 68 ఇన్నింగ్స్‌లలో 145 వికెట్లు పడగొట్టాడు. జస్ప్రీత్ బుమ్రా ఆస్ట్రేలియాలో 23 ఇన్నింగ్స్‌లలో 64 వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికాలో 15 ఇన్నింగ్స్‌లలో 38 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లాండ్‌లో 15 ఇన్నింగ్స్‌లలో 37 వికెట్లు పడగొట్టాడు. న్యూజిలాండ్‌లో 4 ఇన్నింగ్స్‌లలో 6 వికెట్లు పడగొట్టాడు. అంటే వసీం అక్రమ్ తన 18 ఏళ్ల కెరీర్‌లో ఏమి చేయగలిగాడో, బుమ్రా కేవలం 7 ఏళ్లలోనే దాన్ని సాధించబోతున్నాడు.

### ఇంగ్లాండ్‌కు బుమ్రా అతిపెద్ద ముప్పు..

ఈ సిరీస్‌లో కూడా జస్‌ప్రీత్ బుమ్రా ఇంగ్లాండ్‌కు పెద్ద ముప్పుగా మారనున్నాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో, ఈ ఆటగాడు 5 టెస్ట్ మ్యాచ్‌ల్లో 32 వికెట్లు పడగొట్టడం ద్వారా ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. ఇంగ్లీష్ పిచ్‌పై బుమ్రాకు మరిన్ని సహాయం లభించవచ్చు. ఇప్పుడు ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ ఈ లెజెండ్‌ను ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

# ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు.. ఓడితే ఈ ముగ్గురే విలన్లు.. లిస్ట్‌లో గంభీర్ ఫేవరేట్ ప్లేయర్?



**జూన్ 20న భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య మొదటి మ్యాచ్ జరుగుతుంది. మ్యాచ్ ప్రారంభం కావడానికి ఇంకా కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్నాయి. లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానం ఈ మ్యాచ్‌ను స్వాగతించడానికి సిద్ధంగా ఉంది. రెండు జట్లు విజయం కోసం పోటీ పడుతున్నాయి. కానీ, జూన్ 24న అంతా స్పష్టమవుతుంది. విరాట్-రోహిత్, అశ్విన్ లేకపోవడంతో టీం ఇండియా బలహీనంగా కనిపిస్తుందని, దీని కారణంగా 18 సంవత్సరాల తర్వాత ఇంగ్లాండ్‌ను ఇంగ్లాండ్‌లో ఓడించడం కష్టమని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. శుభ్‌మాన్ గిల్ నాయకత్వంలోని టీం ఇండియా మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఓడిపోతే, ఈ ముగ్గురు ఆటగాళ్లను అతిపెద్ద దోషులుగా పరిగణించవచ్చని అంటున్నారు.**

### జట్టు ఓడిపోతే శుభ్‌మాన్ గిల్ బాధ్యత వహించాల్సిందే..

రోహిత్ శర్మ పదవీ విరమణ తర్వాత, శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అతను భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగే 5 మ్యాచ్‌ల సిరీస్ కు కెప్టెన్ పాత్ర పోషించనున్నాడు. అతని భుజాలపై ఒకటి కాదు, రెండు బాధ్యతలుంటాయి. ఎందుకంటే, కెప్టెన్ పాత్ర సులభం కాదు. అతను IPLలో కెప్టెన్‌గా ఉన్నాడు. కానీ, గిల్‌కు అంతర్జాతీయ క్రికెట్ అనుభవం లేదు. ఇంగ్లాండ్ వంటి జట్టుకు కెప్టెన్‌గా ఉండటం అతనికి సవాలుగా ఉంటుంది.

అతని భుజాలపై పరుగులు సాధించాల్సిన పెద్ద బాధ్యత ఉంటుంది. అతను మిడిల్ ఆర్డర్‌లోకి వస్తే, గిల్ విరాట్ కోహ్లీ లాంటి యాంకర్ పాత్రను పోషించాల్సి ఉంటుంది. కానీ, ఇంగ్లాండ్‌పై శుభ్‌మాన్ బ్యాటింగ్ గణాంకాలు చాలా నిరాశపరిచాయి. అతను ఇంగ్లాండ్‌లో 3 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో అతను 14.66 సగటుతో 88 పరుగులు మాత్రమే చేశాడు. ఇంగ్లాండ్ పర్యటనలో గిల్ మొదటి మ్యాచ్‌లో పరుగులు సాధించకపోతే, ఓటమికి కూడా అతను బాధ్యత వహించవచ్చు.

### ఓటమికి బాధ్యత కూడా కేఎల్ రాహుల్‌పై కూడా..

ఇంగ్లాండ్ పర్యటనలో సీనియర్ ఆటగాళ్ళు జట్టులో లేరు. కానీ, అనుభవజ్ఞులైన బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్, అనుభవజ్ఞులైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఈ పర్యటనలో సీనియర్ ఆటగాళ్ళుగా జట్టులో చేరారు. రోహిత్ శర్మ లేనప్పుడు కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించవచ్చు. అతను ఇంతకు ముందు చాలాసార్లు భారతదేశం తరపున ఓపెనర్‌గా కూడా ఉన్నాడు.

కానీ, ఇంగ్లాండ్ బౌన్సీ పిచ్‌లపై అతను ఎలా ఆడతాడు అనేది చాలా ముఖ్యం. అతను గత సంవత్సరం 9 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 35 సగటుతో 493 పరుగులు చేశాడు. ఈ సంవత్సరం అతను 1 టెస్ట్ మ్యాచ్ ఆడాడు. 8.50 సగటుతో 2 ఇన్నింగ్స్‌లలో 17 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇటువంటి పరిస్థితిలో, ఇంగ్లాండ్ పర్యటనలో సీనియర్ బ్యాట్స్‌మన్‌గా అతని నుంచి భారీ అంచనాలు ఉంటాయి. ఇటువంటి పరిస్థితిలో కేఎల్ రాహుల్ టాప్ ఆర్డర్‌లో విఫలమైతే, ఓటమికి నింద అతనిపై పడటం ఖాయం.

### జస్ప్రీత్ బుమ్రా కూడా ఇబ్బందుల్లో పడవచ్చు..

జస్ప్రీత్ బుమ్రా టీం ఇండియా అత్యుత్తమ బౌలర్లలో ఒకరు. బౌలింగ్ పరంగా శుభ్మాన్ గిల్, గౌతమ్ గంభీర్ అతని నుంచి చాలా ఆశలు పెట్టుకుంటారు. ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్‌ను బ్యాక్‌ఫుట్‌లో నెట్టగల ఏకైక బౌలర్ బుమ్రా. కానీ, అతనితో ఉన్న సమస్య ఏమిటంటే అతను నిరంతరం లాంగ్ స్పెల్‌లు వేయలేడు. అతనికి వెన్ను గాయం సమస్య ఉంది. అలాగే అతను మొత్తం 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో పాల్గొనలేడు. అయితే, అతను తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఆడటం ఖాయం. అటువంటి పరిస్థితిలో, టీం ఇండియా విజయం బాధ్యత అతనిపై ఉంటుంది. అతను సమయానికి భారతదేశం తరపున వికెట్లు తీయవలసి ఉంటుంది. ఈ విషయంలో అతను విఫలమైతే, ఓటమికి నింద కూడా అతనిపై పడుతుంది.

# అభిమన్యు ఈశ్వరన్‌కు తప్పకుండా అవకాశం ఇవ్వాలి: మహ్మద్ కైఫ్

లీడ్స్‌లోని హెడింగ్లీ మైదానంలో మరికొన్ని గంటల్లో ఇంగ్లండ్‌- భారత్‌ల మధ్య మొదటి టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కాబోతోంది. టీమ్‌ఇండియా వైస్‌కెప్టెన్ రిషభ్‌పంత్ బ్యాటింగ్ ఆర్డర్‌లో తాను అయిదో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానాల్లో ఆడతాడని ఇంతకుముందే చెప్పేశాడు. మరి కీలకమైన మూడో స్థానంలో ఎవరు ఆడతారనేది ఆసక్తిగా మారింది. గతంలో ఈ స్థానంలో ఆడటమెలాగో ఛతేశ్వర్ పుజారా, రాహుల్ ద్రవిడ్ చూపించారు. ప్రస్తుతమున్న జట్టులో ఈ స్థానం కోసం అభిమన్యు ఈశ్వరన్, సాయి సుదర్శన్ పోటీపడుతున్నారు. సాయి సుదర్శన్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన అతడు అత్యధిక పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. మరోవైపు ఈశ్వరన్ ఇండియా ఏ జట్టు తరఫున సత్తా చాటుతున్నాడు. అయితే వీరిలో అభిమన్యు ఈశ్వరన్‌కే అవకాశం ఇవ్వాలి అని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ తన అభిప్రాయం వ్యక్తంచేస్తున్నాడు. అలాగే ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో భారత జట్టులో సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం కల్పించకపోవడాన్ని అతడు తప్పుపడుతున్నాడు. అభిమన్యు ఈశ్వరన్‌కు అవకాశం ఇవ్వకుండా మరోసారి అదే తప్పు చేయొద్దని సెలక్టర్లకు కైఫ్ సూచిస్తున్నాడు. 'సాయి సుదర్శన్ కన్నా ముందు అభిమన్యు ఈశ్వరన్‌కే ప్లేయింగ్ ఎ లెవన్‌లో ఆడే అవకాశం ఇవ్వాలి. ఈశ్వరన్ 27 ఫస్ట్‌క్లాస్ సెంచరీలు చేశాడు. దాదాపు 8వేలకు పైగా పరుగులు సాధించాడు. అతడికి గుర్తింపు దక్కాల్సిన అవసరం ఉంది. ఇండియా ఏ తరఫున ఆడి అద్భుతంగా పరుగులు చేసిన సర్ఫరాజ్ ఖాన్‌కు టీమ్‌ఇండియాలో అవకాశం ఇవ్వకుండా సెలక్టర్లు పెద్ద తప్పిదం చేశారు. ఇప్పుడు అభిమన్యు ఈశ్వరన్‌ను లీడ్స్‌లో ఆడించకుండా మరో పొరపాటు చేయొద్దు' అని మహ్మద్ కైఫ్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశాడు.

# 5 బంతుల్లో 4 వికెట్లు.. ఓడిపోయే మ్యాచ్‌ను మలుపు తిప్పిన చెన్నై చిన్నోడు..

**క్రికెట్ అంటేనే అనూహ్య మలుపులు, ఉత్కంఠభరితమైన క్షణాలు. అలాంటి ఒక అద్భుత ఘట్టం తమిళనాడు ప్రీమియర్ లీగ్ 2025లో చోటు చేసుకుంది. సేలం వేదికగా జరిగిన ఒక మ్యాచ్‌లో సూర్య ఆనంద్ అనే యువ బౌలర్ తన అద్భుతమైన బౌలింగ్‌తో తన జట్టుకు అసాధారణ విజయాన్ని అందించాడు. చివరి ఓవర్‌లో 5 బంతుల్లో ఏకంగా 4 వికెట్లు పడగొట్టి, హ్యాట్రిక్ సాధించి, నెల్లై రాయల్ కింగ్స్‌ను నివ్వెరపరిచాడు.**

సీచెమ్ మదురై పాంథర్స్ వర్సెస్ నెల్లై రాయల్ కింగ్స్ మధ్య జరిగిన ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. మదురై పాంథర్స్ బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లై రాయల్ కింగ్స్ విజయం దిశగా సాగుతోంది. చివరి రెండు ఓవర్లలో వారికి కేవలం 11 పరుగులు మాత్రమే అవసరం కాగా, చేతిలో 4 వికెట్లు ఉన్నాయి. నెల్లై విజయం దాదాపు ఖాయం అనిపించింది.

### సూర్య ఆనంద్ మేజిక్..

అయితే, 19వ ఓవర్‌ను వేయడానికి సూర్య ఆనంద్ వచ్చాడు. అప్పటి వరకు నెల్లై జట్టు క్రీజ్‌లో నిలదొక్కుకున్న సోనూ యాదవ్ (32) ను మొదటి బంతికే అవుట్ చేసి సూర్య ఆనంద్ మదురైకి ఆశలు రేపాడు. తర్వాతి బంతి డాట్ బాల్. ఆ తర్వాత జరిగిన మూడు బంతుల్లో యుధీశ్వరన్ (0), సచిన్ రాఠీ (0), ఇమ్మాన్యుయేల్ చెరియన్ (0) లను వరుసగా అవుట్ చేసి సూర్య ఆనంద్ హ్యాట్రిక్ నమోదు చేయడంతో పాటు మొత్తం 5 బంతుల్లో 4 వికెట్లు పడగొట్టాడు. ఈ అనూహ్య బౌలింగ్‌తో నెల్లై రాయల్ కింగ్స్ 18.5 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌట్ అయింది. ఫలితంగా, సీచెమ్ మదురై పాంథర్స్ 10 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది.







# ఆ మాట దిల్ రాజు చెప్పాలంటోంది!

కీర్తి సురేష్ తెలుగులో కనిపించి దాదాపు రెండేళ్లవుతోంది. మెగాస్టార్ నటించిన భోళా శంకర్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. రీసెంట్‌గా తన చిరకాల మిత్రుడు, ప్రేమికుడిని పెళ్లిచేసుకున్న కీర్తి మళ్లీ సినిమాల విషయంలో జోరు పెంచింది. టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్‌తో కలిసి కీర్తి సురేష్ నటించిన లేటెస్ట్ మూవీ ఉప్పు కప్పురంబు. ఐవీ శశి రూపొందించిన ఈ మూవీ సెటైరికల్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కింది. అయితే ఇది థియేట్రికల్ రిలీజ్ కావడం లేదు. రఘుతాత తరహాలో ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతోంది.ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియలో జూలై 4 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ మూవీ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ ఇంత వరకు వచ్చిన డార్క్ కామెడీ సినిమాలకు పూర్తి భిన్నంగా సాగే సినిమా ఇది. ఒక సీరియస్ విషయాన్ని చాలా ఫన్నీగా ఇందులో చెప్పాంఅని తెలిపింది. ఇదిలా ఉంటే ఈ సందర్భంగా కీర్తిసురేష్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.ఇదిలా ఉంటే రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ హీరోగా దిల్ రాజు నిర్మించబోతున్న రౌడీ జనార్ధనలో కీర్తిసురేష్ నటిస్తోందని, విజయ్‌తో తను రొమాన్స్ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో నిజమెంత అని మీడియా అడిగిన ప్రశ్నకు కీర్తి సురేష్ స్పందించిన తీరు ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజయ్ దేవరకొండ – రవికిరణ్ కోలా కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాలో మీరు నటిస్తున్నారా? అని ప్రశ్నిస్తే లేదని చెప్పకుండా దిల్ రాజు చెబుతారు అంటూ స్పందించడంతో రౌడీ అభిమానులు ఖుషీ అవుతున్నారు.తను చెప్పిన సమాధానంలోనే అసలు విషయం ఉందని, రౌడీ జనార్ధనలో తను నటిస్తోందని స్పష్టమైందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రౌడీ జనార్ధనలో కీర్తి సురేష్ నటిస్తోందని త్వరలోనే దిల్ రాజు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటి వరకు కీర్తిసురేష్, విజయ్ దేరవకొండ కలిసి నటించలేదు. కానీ రెండు సినిమాల్లో మాత్రం నటించారు. మహానటిలో విజయ్ దేవరకొండ నటించిన విషయం తెలిసిందే. ఇక నాగ్ అశ్విన్ నిర్మించిన జాతిరత్నాలులోనూ వీరిద్దరు గెస్ట్ క్యారెక్టర్లలో వేరు వేరుగా కనిపించి ఆకట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరు కలిసి నటించనున్న తొలి సినిమా రౌడీ జనార్ధన కాబోతోంది.

# థియేటర్‌లో రెస్పెన్స్‌కు ఎమోషనల్ అయిన హీరో!




శేఖర్ కమ్ములతో ధనుష్ తొలి సారి కలిసి చేసిన ఎమోషనల్ యాక్షన్ డ్రామా కుబేర. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలోని కీలక పాత్రలో కింగ్ నాగార్జున నటించారు. సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్న కుబేర ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. శేఖర్ సినిమాలంటే ప్రేక్షకుల్లో ఓ ప్రత్యేకత ఉంది. ఆయన రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా చేస్తారని, అంతే కాకుండా మనసుకు హత్తుకునే సున్నితమైన భావోద్వేగాల సమాహారంగా ఆయన సినిమా ఉంటుందని తెలుగు ప్రేక్షకుల్లో ఓ గుర్తింపు ఉంది.అదే ఫార్ములాతో కమర్షియల్ లెక్కలకు దూరంగా, రియలిస్టిక్ అప్రోచ్‌తో శేఖర్ కమ్ముల చేసిన సినిమా ఇది. సింపుల్ కథలకు సున్నితమైన భావోద్వాగాల్ని జోడించి శేఖర్ చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేశాయి. ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుని వారి నీరాజనాలందుకున్నాయి. కుబేర కూడా అదే స్థాయిలో ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని మొదటి నుంచి శేఖర్ కమ్ముల గట్టి నమ్మకంతో చెబుతూ వచ్చారు.ఫైనల్‌గా ఈ మూవీ శుక్రవారం భారీ అంచనాల మధ్య విడుదలైంది. ప్రేక్షకులతో పాటు ఈ మూవీని ఫస్ట్ డే ఫస్ట్ మార్నింగ్ షోని థియేటర్లలో చూడాలని నిర్ణయించుకున్న హీరో ధనుష్ చెన్నైలోని శుక్రవారం ఓ థియేటర్‌కు వెళ్లారు. థియేటర్లో ధనుష్ నటనకు ముగ్ధులైన ప్రేక్షకులు అరుపులు, కేకలు వేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అది చూసిన ధనుష్ ఎమోషనల్ అయ్యారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ప్రేక్షకులు సినిమా చూస్తూ ఆనందంతో అరుపులు,కేరింతలతో థియేటర్‌ని హోరెత్తిస్తుంటే అదే థియేటర్‌లో సినిమా చూస్తున్న ధనుష్ కూర్చీలో పలికించిన హావ భావాలు, ప్రేక్షకుల ఆనందానికి మంత్రముగ్ధుడై భావోద్వానికి లోనైన దృశ్యాలు ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యక్ష్యంగా ప్రేక్షకుల రెస్పాన్స్ కళ్లెదుటే కనిపిస్తుండటం, తన నటనపై ప్రశంసల వర్షం కురిపిస్తుండటంతో ధనుష్ ఎమోషనల్ అయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# ఈస్పీడ్ లో డ్యాషింగ్ డైరెక్టర్ నే మించేలా ఉన్నాడే?



ఇండస్ట్రీలో అత్యంత వేగంగా షఉటింగ్ పూర్తి చేయగల దర్శకుడు ఎవరు? అంటే ఒన్ అండ్ ఓన్లీ పూరి జగన్నాధ్ పేరే అంతా చెబుతారు. పూరి జెట్ స్పీడ్ తో షఉటింగ్ పూర్తి చేస్తాడు. మహా అయితే ఆయన సినిమా షఉటింగ్ రెండు నెలలు. ఇంకా అంతకు మించి మూడు నెలలు. లీస్ట్ గా చూసుకుంటే నెల రోజుల్లో చుట్టేస్తాడు. షఉటింగ్ పూర్తి చేయడం అన్నది కేవలం దర్శకుడి చేతిల్లో పని మాత్రమే. అక్కడ అతడు చెప్పిందే వేదం.అందుకే పూరి సినిమాలకు నిర్మాణ వ్యయం తక్కువవుతుంది. అటుపై పోస్ట్ ప్రొడక్షన్ అన్నది సినిమా పై ఆధారపడి ఉంటుంది. పూరి మేకింగ్ స్పీడ్ చూసి దర్శకధీరుడు రాజమౌళినే ఫిదా అయ్యారు. సినిమా ఎలా తీయాలో పూరి వద్ద అసిస్టెంట్ గా పనిచేసి నేర్చుకోవాలని రాజమౌళినే దిగొచ్చి అన్నారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు గానీ, దాని ఖర్చుగానీ, ప్రచారం ఖర్చు..రిలీజ్ ఇలా ప్రతీ దాని లో పూరి మార్క్ కనిపిస్తుంది.ఎక్కడికక్కడ ఆయన ఖర్చు తగ్గించి సింపుల్ గా తేల్చేస్తాడు. దటీజ్ పూరి. మరి పూరి పేరిట ఉన్న ఈ రికార్డును యంగ్ డైరెక్టర్ అనీల్ రావపూడి బ్రేక్ చేసే అవకాశం ఉందా? అందుకు ఛాన్సెస్ కనిపిస్తు న్నాయి. పదేళ్ల కెరీర్ లో ఎనిమిది సినిమాలు తీసాడు అనీల్. వీటిలో ఒక్కటి కూడా ప్లాప్ కాలేదు. అంటే ఆయన ఖాళీగా ఉంది రెండేళ్లు మాత్రమే. మిగతా సమయమంతా ఎంతో ఫోకస్ట్ గా పనిచేసాడు కాబట్టే సాధ్యమైంది. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో విక్టరీ వెంకటేష్ ని ఏకంగా 300 కోట్ల క్లబ్ లో కూర్చోబెట్టాడు.ఇక అనీల్ మేకింగ్ శైలి కూడా పూరి తరహాలోనే వేగంగా ఉంటుంది. సినిమాని చెప్పిన టైమ్ కి రిలీజ్ చేయడం అనీల్ ప్రత్యేకత. ఇటీవలే మెగాస్టార్ 157వ చిత్రం పట్టాలెక్కిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా రెండు షెడ్యూళ్లను పూర్తి చేసుకుంది. తాజాగా ముస్సోరీ షెడ్యూల్ కూడా పూర్తయింది. ఈ చిత్రాన్ని సంక్రాం తి కానుకగా రిలీజ్ చేస్తున్నట్లు ప్రారంభోత్సవం రోజే ప్రకటించారు. ఆ తేదీకి కట్టుబడే షఉటింగ్ వేగంగా పూర్తి చేస్తున్నారు. అనీల్ స్పీడ్...స్పార్క్ ఇంకా మెరుగవుతుంది. అప్పుడు పూరినే మించిపోతాడు.




# తప్పంతా కోలీవుడ్ డైరెక్టర్స్ దేనా? మన హీరోలది ఏం లేదా?



తమిళ హీరోలకు తెలుగు డైరెక్టర్స్ సూపర్ హిట్స్.. కానీ తెలుగు హీరోలకు తమిళ డైరెక్టర్స్ డిజాస్టర్లు.. కొంతకాలంగా సోషల్ మీడియాలో ఆ విషయంపై ఎప్పటికప్పుడు చర్చలు నడుస్తూనే ఉంటాయి. తాజాగా రిలీజ్ అయిన కుబేర మూవీ హిట్ అయిన నేపథ్యంలో అదే చర్చలు మరోసారి ఊపందుకున్నాయి. నెటిజన్లు తెగ డిస్కస్ చేసుకుంటున్నారు.అయితే టాలీవుడ్ కథానాయకులకు ఇప్పటికే ఫ్లాపులు ఇచ్చిన అనేక మంది కోలీవుడ్ దర్శకుల వైపే మొత్తం తప్పంతా నెట్టేయొచ్చా? తెలుగు హీరోలది ఎలాంటి తప్పు ఉండడం లేదా? పాత్రలు, కథ ఎంపికలో సరిగ్గానే ముందుకు వెళ్తున్నారా? ఈ విషయంపై సినీ వర్గాలు ఏం చెబుతున్నాయి? ఓసారి డిస్కస్ చేసుకుందాం.నిజానికి.. శేఖర్ కమ్ముల, వెంకీ అట్లూరి వంటి పలువురు టాలీవుడ్ డైరెక్టర్స్ తమిళ హీరోలతో వర్క్ చేసి సూపర్ హిట్స్ అందించారు. ఇప్పుడు కుబేర.. అప్పుడు సార్.. రెండు మూవీలు మంచి విజయాలు సాధించాయి. బాక్సాఫీస్ వద్ద సాలిడ్ వసూళ్లను రాబట్టడమే కాకుంగా.. కంటెంట్ అండ్ స్టోరీ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచి ఆకట్టకున్నాయి.అదే తెలుగు హీరోలతో పనిచేసిన తమిళ డైరెక్టర్లు.. ఎక్కువగా డిజాస్టర్లనే అందించారు. రీసెంట్ గా స్టార్ హీరో రామ్ చరణ్ కు గేమ్ ఛేంజర్ తో భారీ ఫ్లాప్ ఇచ్చారు శంకర్. అంతకుముందు మహేష్ బాబు స్పైడర్, రామ్ ది వారియర్, నాగ చైతన్య కస్టడీ సహా పలు ప్రాజెక్టులతో తెలుగు హీరోలతోపాటు ఆడియన్స్ ను కూడా కోలీవుడ్ డైరెక్టర్స్ నిరాశపరిచారు.అలా అని తప్పంతా తమిళ దర్శకులదేనని అనడం కరెక్ట్ కాదేమో. వారు తమ వర్క్ తో నిరాశపరచడం నిజమే. అదే సమయంలో తెలుగు హీరోల్లో చాలా మంది.. స్టోరీ అండ్ రోల్స్ ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అన్ని పాత్రలను ఒప్పుకోవడం లేదన్నది నిజమే. ఇప్పుడు కుబేర మూవీలో కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ బిచ్చగాడిగా కనిపించారు.ఇప్పుడు ఆ పాత్రను తెలుగు హీరోల్లో ఎవరైనా ఒప్పుకుంటారా అంటే డౌటే. కానీ ధనుష్ మాత్రం వెంటనే అంగీకరించారు. సినిమాలో తనదైన నటనతో మెప్పించారు. మంచి ప్రశంసలు అందుకుంటున్నారు. అసాధారణమైన పాత్రలను ప్రయత్నించడానికి టాలీవుడ్ స్టార్ హీరోలు మాత్రం ముందుకు రావడం లేదన్నది మాత్రం నిజం.ఇక్కడ వారు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోయేసరికి.. కోలీవుడ్ కు వెళ్ళి హీరోలను తెచ్చుకుంటున్నారు. అందులో తెలుగు డైరెక్టర్స్ తప్పేం లేదు. అయితే తెలుగు హీరోలు మాత్రం సేఫ్ జోన్ నే సెలెక్ట్ చేసుకుంటున్నారని అనేక మంది నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. హైప్ ఎక్కువ క్రియేట్ చేసే పలువురు తమిళ డైరెక్టర్స్ ను ఎంచుకుని డీలా పడుతున్నారు.అయితే తమిళ డైరెక్టర్స్ కూడా కథల పరంగా అప్డేట్స్ అవ్వాల్సిన సమయం వచ్చినా.. తెలుగు హీరోల రూట్ కూడా కాస్త మారాల్సిందే. యాక్షన్, స్కేల్ లేదా విజువల్స్ పరంగా కాకుండా.. కంటెంట్ తోపాటు భావోద్వేగ సంక్లిష్టతలో కూడా రిస్క్ తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలనే చెప్పాలి. ఇప్పుడు కుబేర విషయంలో ధనుష్ అదే చేశారు.అలా జరిగితేనే అంతా అనుకున్నట్లు జరుగుతుంది. ముఖ్యంగా తెలుగు డైరెక్టర్స్ ఎప్పటికప్పుడు కొత్త కొత్త కథలతో ముందుకు వస్తున్నారు. కాబట్టి కంటెంట్ లో బలం ఉంటే తప్పక ఆ పాత్రలను చేసే అవకాశాన్ని టాలీవుడ్ హీరోలు దక్కించుకోవడం బెటర్. అప్పుడు ఏ ఇండస్ట్రీకి చెందిన డైరెక్టర్ తో అయినా హిట్ అందుకోవడం ఖాయం!

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339